# మహానది

MAHANADI TELUGU DAILY

Website: www.mahanadi.net

RNI No. TELTEL . 12/48343

రంగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 54 | | ఎడిటర్ : మామిడి సోమయ్య | ఆదివారం | మే | 31 | 2026 పేజీలు : 8 వెల : రూ.2.00


## గ్రీన్‌కార్డ్ నిబంధనల విషయంలో అమెరికా యూటర్న్

అమెరికాలో శాశ్వత నివాస హక్కు అమెరికాలో శాశ్వత నివాస హక్కు నిబంధనల విషయంలో అమెరికా యూటర్న్ తీసుకుంది. గ్రీన్‌కార్డ్ దరఖాస్తు ప్రక్రియ జరుగుతున్న సమయంలో వలసదారులు యూఎస్‌ను విడిచి వెళ్లాల్సిన అవసరం లేదని 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ తాజాగా వెల్లడించింది. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. తాత్కాలిక వలసదారులు గ్రీన్‌కార్డ్ దరఖాస్తులు సమర్పించడానికి స్వదేశానికి వెళ్లాల్సి ఉంటుందని అమెరికా పౌరసత్వ, వలస సేవల సంస్థ మే 21న చేసిన ప్రకటన గందరగోళానికి దారితీసింది. దీనిపై తాజాగా డీహెచ్‌ఎస్ వివరణ ఇచ్చింది. తాజా ప్రకటనలో డీహెచ్‌ఎస్ స్పందిస్తూ.. ఇదేమీ విస్తృతస్థాయి విధాన మార్పేమీ కాదని వెల్లడించింది. దరఖాస్తుదారుడు గ్రీన్‌కార్డు ప్రక్రియను అమెరికాలో ఉండి పూర్తిచేయాలా..? స్వదేశానికి వెళ్లాలా..? అన్నదానిని ఇమిగ్రేషన్ అధికారి నిర్ణయిస్తారని తెలిపింది. ఇది ఎప్పటి నుంచో అమల్లో ఉన్న నిబంధనే అని పేర్కొన్నది.

# మోటార్లకు మీటర్లు పెట్టం

- వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో పోటీ చేయబోమని సవాల్
- మీటర్లు పెట్టకపోతే బీఆర్‌ఎస్ పోటీ నుంచి తప్పుకుంటుందా అని ప్రశ్న
- హరీశ్ రావు ఏ పార్టీలో ఉంటారో ఆయనకే తెలియదని రేవంత్ విమర్శ
- రైతులకు నాణ్యమైన విద్యుత్ కోసమే 'రైతు డిస్కం' అని స్పష్టత

## వడ్లు కొనకపోతే బీజేపీ నేతల ఇళ్ల ముందు నిరసనలని హెచ్చరిక

**హైదరాబాద్, మే 30**

'మోటార్లకు మీటర్లు పెట్టినా, రైతులకు ఉచిత విద్యుత్ నిలిపివేసినా మేం ఎన్నికల్లో పోటీ చేయం. ఒకవేళ మోటార్లకు మీటర్లు పెట్టకపోయినా, ఉచిత విద్యుత్ కొనసాగించినా వచ్చే ఎన్నికల్లో పోటీ నుంచి బీఆర్‌ఎస్ తప్పుకుంటుందా..?' అని బీఆర్‌ఎస్ పార్టీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. రాజకీయ లబ్ధి కోసం కేసీఆర్ రైతుల ముసుగులో లైఫ్ లైన్ కోసం ప్రయత్నిస్తున్నారని సీఎం మండిపడ్డారు.రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించేందుకే రైతు డిస్కం ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. శనివారం ఎంసీహెచ్‌ఆర్డీలో సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభు త్వం ఉచితంగా అందిస్తున్న విద్యుత్ వినియోగాన్ని రైతు డిస్కంకు కనెక్ట్ చేస్తున్నా మని, దేశంలోనే మొట్ట మొదటిసారిగా, ఎక్కడాలేని విధంగా రైతు డిస్కంను ఏర్పాటుచేశామని తెలిపారు.



**అబద్ధాల పునాదుల మీదనే..**

బీజేపీ, బీఆరెస్ అబద్ధాల పునాదులపై పార్టీలను బతికించుకోవాలని ప్రయత్నిస్తున్నాయని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. 'కేంద్ర మంత్రికిషన్‌రెడ్డికి నేను ఒకటే చెప్పదలుచుకున్నా.. రైతు పండించిన ప్రతీ గింజను మా ప్రభుత్వం కొంటుంది. మేం కొంటున్నది ఎంత.. కేంద్రం కొనేది ఎంత..? కేవలం 32 శాతమే కేంద్రం కొంటోంది. కేంద్రం మద్దతు ధర నిర్ణయించడం వరకే.. ధాన్యం మాత్రం కొనడం లేదు.

**మోదీ మహారాష్ట్రను ఒప్పించలేరా..**

అంతర్రాష్ట్ర జల వివాదాలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సహకార ధోరణితో పరిష్కరించుకోవలని ప్రధాని నరేంద్రమోదీ చెబుతున్నారని, అందుకే ప్రాణహిత ప్రాజెక్టుపై మహారాష్ట్ర సీఎంతో చర్చలకు ప్రయత్ని స్తున్నామని సీఎం తెలిపారు. తుమ్మిడిహట్టి కోసం కలిసి మాట్లాడటానికి మహారాష్ట్ర ము ఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ కోరినా స్పం దించడంలేదన్నారు.

### దేశరక్షణ కోసం 'ధర్మ హింస'
# అవసరమే

- కేవలం అహింసతోనే సమస్యలు పరిష్కారం కావన్న ఆదిత్యనాథ్
- దేశాన్ని, ధర్మాన్ని కాపాడేందుకు ధర్మ హింస కూడా అవసరమేనని వ్యాఖ్య
- సైనికుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచన



**న్యూఢిల్లీ,మే,30:**

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్య నాథ్ దేశ భద్రత, అహింస, ధర్మరక్షణపై కీలక వ్యాఖ్యలు చేశారు. లక్నోలో నిర్వహించిన 'నౌసేన శౌర్య వాటిక' ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడు తూ... అహింస మానవాళికి పరమ ధర్మ మే అయినప్పటికీ, దేశానికి లేదా సమా జానికి ఎవరైనా ముప్పుగా మారినప్పుడు కేవలం అహింసతోనే సమస్యలు పరిష్కా రం కావని స్పష్టం చేశారు. దేశాన్ని, ధర్మాన్ని కాపాడే క్రమంలో అవసరమైతే బలప్రయోగం లేదా 'ధర్మ హింస' చేయ డం కూడా అంతే ముఖ్యమన్నారు. బలహీ నులను ప్రపంచం ఎప్పుడూ గౌరవించద ని, భద్రతాపరంగా శక్తివంతమైన దేశాల తోనే ఇతర దేశాలు స్నేహాన్ని కోరుకు ంటాయని యోగి పేర్కొన్నారు.

### పేదల గుమ్మం వద్దకే
# సంక్షేమ పథకాలు

- రేవంత్ కానుకగా తొలి విడతలో లక్ష ఇండ్లు
- ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి
- ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శంకుస్థాపన

**హైదరాబాద్, మే 30**

: 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదలకు పెద్దన్న.. క్యూర్ పరిధిలో తొలి విడతలో లక్ష ఇండ్లు నిర్మించి రేవంత్ కానుకగా ఇస్తాం'అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. లక్ష ఇండ్లకు సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా శంకుస్థాపన చేసి, ఏడాది తిరిగేలోగా వాటి నిర్మాణాలు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాల యాల సముదాయానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్‌తో కలిసి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్



ప్రభుత్వ హయాంలో ప్రజ నివా స ప్రాంతం నుంచి -40 కిలోమీటర్ల దూరం లో ఇండ్లు నిర్మించారని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం అలా చేయదని, అసెంబ్లీ నియోజకవర్గం యూనిట్‌గా అక్కడే ఇండ్లు కట్టించి, రేవంత్ కానుకగా అందజేస్తామని మంత్రి తెలిపారు. ఇది పేదోడి ప్రభుత్వమని, పేదల కష్టాలు తెలిసిన ప్రభుత్వమని, దొరల ప్రభు త్వం కాదన్నారు.

### టికెట్ల జారీలో
# కీలక మార్పులు

- శ్రీవాణి ట్రస్ట్ టికెట్ల జారీ విధానంలో టీటీడీ మార్పులు
- దాతల కోసం రోజూ 300 టికెట్లతో ప్రత్యేక కోటా ఏర్పాటు
- జూన్ 10 నుంచి అమల్లోకి రానున్న కొత్త నిబంధనలు
- తిరుపతి ఎయిర్‌పోర్ట్‌లో 200 టికెట్ల కరెంట్ బుకింగ్ సౌకర్యం

**తిరుమల,మే30,**

తిరుమల శ్రీవారి భక్తులకు, ముఖ్యంగా శ్రీవాణి ట్రస్ట్ దాతలకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శుభవార్త చెప్పింది. భక్తుల సౌకర్యార్థం శ్రీవాణి ట్రస్ట్ దర్శన టికెట్ల కేటాయింపులో పలు కీలక మార్పులు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే విరాళం చెల్లించి దర్శనం కోసం ఎదురుచూస్తున్న దాతల కోసం ప్రతిరోజూ 300 టికెట్లను ప్రత్యేకంగా కేటాయించనుంది. ఈ కొత్త విధానం జూన్ 10వ తేదీ నుంచి అమల్లోకి రానుంది.టీటీడీ తీసుకున్న ఈ నిర్ణయంతో, 2025 మే 1వ తేదీ తర్వాత



శ్రీవాణి ట్రస్ట్‌కు రూ.10 వేలు విరాళం ఇచ్చిన దాతలు ఈ ప్రత్యేక కోటాకు అర్హులవుతారు. ఈ 300 టికెట్లను ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. మధ్యాహ్నం 1 గంటలోపు టికెట్ బుక్ చేసుకున్న భక్తులకు అదే రోజు సాయంత్రం 4 గంటలకు శ్రీవారి దర్శనం కల్పిస్తారు.

## అమరావతి అర్బన్ మొబిలిటీ ప్లానింగ్ పై సీఎం చంద్రబాబు ఫోకస్

- ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 61వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం
- భవిష్యత్ ప్రణాళికలపై చర్చ.. మొత్తం 18 ప్రతిపాదనలకు ఆమోదం
- హైకోర్టు భవనాల వద్ద రూ.547 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన

**అమరావతి,మే30**

అమరావతి రాజధాని నిర్మాణ పనుల్లో వేగం పెంచే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. శనివారం ఆయన అధ్యక్షతన జరిగిన 61వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో 18 కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేశారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రాజధానిలో పటిష్టమైన అర్బన్ మొబిలిటీ ప్లానింగ్ ఉండాలని అధికారులను ఆదేశించారు.సమావేశంలో భాగంగా, హైకోర్టు భవనాలకు సంబంధించి వివిధ మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.547.07 కోట్లు కేటాయించడానికి అథారిటీ ఆమోదం తెలిపింది. పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు పీపీపీ పద్ధతిలో జెయింట్ అబ్జర్వేషన్ వీల్ నిర్మాణానికి, భవన నిర్మాణ వివాదాల సత్వర పరిష్కారానికి ప్రత్యేక బిల్డింగ్ ట్రైబ్యునల్ ఏర్పాటుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో పాటు, అమరావతిలో సమర్థవంతమైన అగ్నిమాపక నియంత్రణ కోసం సీఆర్డీఏకు



సొంత ఫైర్ వింగ్ ఏర్పాటు చేసుకునేందుకు అంగీకరించారు.

### తెలంగాణ ఎడ్‌సెట్ 2026 ఫలితాలు
# విడుదల

**96.95 శాతం మంది అభ్యర్థులు ఉత్తీర్ణత**



**హైదరాబాద్,మే30,**

తెలంగాణలో బీఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన టీజీ ఎడ్‌సెట్-2026 ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి, కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య ప్రతాప్ రెడ్డి ఈ ఫలితాలను వెల్లడించారు. ఈ పరీక్షలో మొత్తం 96.95 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు వారు తెలిపారు.ఈ ఏడాది ఎడ్‌సెట్‌కు మొత్తం 35,600 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వారిలో 29,342 మంది పరీక్షకు హాజరయ్యారు.

# కష్టాల్లో స్పైస్‌జెట్..

**ఇంటర్నెట్ డెస్క్,మే30**


ప్రముఖ బడ్జెట్ విమానయాన సంస్థ స్పైస్‌జెట్ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంది. నెలల తరబడి జీఎస్టీ రిటర్నులు దాఖలు చేయడంలో విఫలమైనందుకు గాను వస్తు సేవల పన్ను (జీఎస్టీ) శాఖ ఆ సంస్థకు రూ. 124.65 కోట్ల పన్ను డిమాండ్ నోటీసు జారీ చేసింది.

## తెలంగాణలోని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్

- పలు జిల్లాల్లో తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశముందని హెచ్చరిక
- మహబూబాబాద్, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో తీవ్ర వడగాల్పులకు అవకాశం

**హైదరాబాద్,మే30**

హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలంగాణలోని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. పలు జిల్లాల్లో తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశముందని




హెచ్చరించింది. మహబూబాబాద్, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో వడగాల్పులు తీవ్రంగా ఉండవచ్చని పేర్కొంది.

## గోదావరిఖనిలో పర్యటించిన బండారు దత్తాత్రేయ

- కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితిపై బండారు దత్తాత్రేయ ఆందోళన
- లక్ష కోట్లతో నిర్మించిన ప్రాజెక్టు నిరుపయోగంగా మారిందన్న మాజీ గవర్నర్

**హైదరాబాద్,మే30**

మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ గోదావరిఖనిలో పర్యటించిన సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిన ఉదంతంపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఇప్పటికే ఒక స్పష్టమైన నివేదికను ఇచ్చిందని ఆయన ఈ సందర్భంగా




గుర్తుచేశారు.ప్రాజెక్టు పరివాహక ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకపోవడం వల్ల జరుగుతున్న నష్టాన్ని దత్తాత్రేయ వివరించారు.

## భారత్‌లో భారీగా తగ్గిన బంగారం డిమాండ్!

- కేంద్రం నిర్ణయంతో బంగారం కొనుగోళ్లు డౌన్
- పసిడిపై పన్ను భారం భారీగా పెంపు
- నిత్యవసరాల ధరల పెరుగుదల వల్ల నష్టం
- లైట్‌వెయిట్ నగల వైపు కస్టమర్ల మొగ్గు

**హైదరాబాద్,మే30,**

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఒక్క నిర్ణయం దేశంలో పసిడి అమ్మకాలను భారీగా తగ్గించేసింది. దిగుమతి సుంకాన్ని భారీగా పెంచడంతో విక్రయాలు పడిపోయాయి. ఇరాన్ ఉద్రిక్తతలతో పెరిగిన ఇంధన, ఆహార ధరలు తోడవడంతో జనం అసలు షాపుల వైపు



వెళ్లడమే మానేశారు. కేవలం రెండు వారాల వ్యవధిలోనే దేశవ్యాప్తంగా పసిడి డిమాండ్ ఊహించని విధంగా 70 శాతం మేర పడిపోయింది.

# ఉద్యమకారులకు గుర్తింపు, న్యాయం చేయాలి




**హైదరాబాద్,మహానది న్యూస్,మే 30:** "ఉద్యమకారులకు తగిన గుర్తింపు, న్యాయం జరగాలి" అని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం చైర్మన్ డా. కాచం సత్యనారాయణ అన్నారు. బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన చర్చాగోష్టిలో ఆయన మాట్లాడారు. 2014లో ఉద్యమకారుల సంక్షేమ సంఘాన్ని స్థాపించామని, ఉద్యమకారుల సంక్షేమమే తమ సంఘం ఏకైక లక్ష్యమని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ఇతర సంఘాలతో కలిసి పోరాటం చేయడంలో ముందుంటామని చెప్పారు.
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఆంధ్ర పాలకుల వివక్ష నుంచి పుట్టిందే తెలంగాణ ఉద్యమమని, 2001 నుంచి 2014 వరకు అన్ని వర్గాల ప్రజలు ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడారని గుర్తుచేశారు. ఎల్బీ నగర్లో శ్రీకాంత్ చారి ఆత్మాహుతి తర్వాత ఉద్యమం వేగం అందుకుందని తెలిపారు. డిసెంబర్ 9న యూపీఏ ప్రభుత్వం తెలంగాణపై ప్రకటన చేసినప్పటికీ, ఆంధ్ర నాయకుల కుట్రలతో వెనక్కు వెళ్లిందని విమర్శిం చారు. అనంతరం జేఏసీ ఆధ్వర్యంలో మళ్లీ ఉద్యమం బలపడిందన్నారు. ఉద్యమంలో పాల్గొన్న వారు ప్రభుత్వ సహాయం కోసం కాకుండా గుర్తింపు కోసం పోరాడారని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల మేరకు గుర్తింపు కమిటీ ఏర్పాటు చేయడాన్ని స్వాగతించినా, న్యాయం కోసం జుడీషియల్ కమిటీ అవసరమని సూచించారు. ఉద్యమకారులకు 250 గజాల స్థలం, గుర్తింపు కార్డు, బస్ పాస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఫ్యూచర్ సిటీలో 1000 ఎకరాలు కేటాయించాలని కోరారు. హామీల అమలులో ఆలస్యం చేస్తే మళ్లీ ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.
మోతే శోభన్ రెడ్డి మాట్లాడుతూ గుర్తింపు కమిటీలో అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 4న అన్ని పార్టీలతో సమావేశం నిర్వహించి సూచనలు తీసుకుంటామని చెప్పారు.
ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్లలో ఉద్యమకారులను పట్టించుకోలేదని విమర్శించారు. తెలంగాణ కోసం పోరాడిన వారిని అణ చివేసే ప్రయత్నాలు జరిగాయని అన్నారు. మిలియన్ మార్చ్ సందర్భ ంగా ట్యాంక్ బండ్‌కు అనుమతి ఇవ్వలేదని గుర్తుచేశారు. తెలంగాణలో మార్పు కోసం చేసిన పోరాట ఫలితంగా ఇప్పుడు మాట్లాడే అవకాశం వచ్చిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ అందరికీ న్యాయం చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.
మళ్లీ ఉద్యమ ఆశయాల సాధన కోసం అవసరమైతే పోరాటం కొనసాగిస్తామని పిలుపునిచ్చారు. ఉద్యమకారులందరినీ కలుపుకుని




పనిచేస్తామని తెలిపారు. తొలిదశ ఉద్యమకారులపై నమోదైన కేసులు, ఎఫ్ఐఆర్‌లు లేనివిషయాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి న్యాయం చేయాలని కోరారు. కుటుంబాలు తమ పూర్వీకుల పోరాటాన్ని గుర్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈసమావేశంలో రాములు నాయక్, పాశం యాదగిరి, ముక్కాల సాంబశివరావు, కె.వి. రంగారెడ్డి, పల్లె వినయ్ కుమార్, శ్రవణ్ కుమార్ గుప్తా, బిరెల్లి వెంకటరెడ్డి, కొత్త రవికుమార్, మహేందర్ యాదవ్, కూర రమేష్, వెంకటాచారి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1969, మలిదశ ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## ఫీజు రీయంబర్స్మెంట్ పథకాన్ని యధాతథంగా అమలు చేయకపోతే
# ప్రభుత్వానికి తగిన బుద్ధి చెపుతాం
## - బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య



**సైఫాబాద్,మహానది న్యూస్, మే 30:** ఫీజు రీయంబర్స్మెంట్ పథకాన్ని యధాతథంగా అమలు చేయకపోతే ప్రభుత్వానికి తగిన బుద్ధి చెపుతామని అఖిలపక్ష సమావేశం హెచ్చరించింది. బిసీలు చదుకుంటే సిఎం రేవంత్ రెడ్డి ఓర్చుకోలేక పోతున్నారని, ఈ పద్ధతిని మార్చుకోకపోతే పతనం తప్పదని సమావేశం సూచించింది. తక్షణమే జీవో నెంబరు 7ను రద్దు చేసి గత 18ఏళ్ళుగా ప్రతి ఏడాది లక్షలాది మంది విద్యార్థులకు కొనసాగుతున్న ఫీజు రీయంబర్స్ మెంట్ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం బేషరుతుగా అమలు చేయాలని రాజ్యసభ సభ్యుడు జాతీయ బిసి సంక్షేమసంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. లేని పక్షంలో సిఎం రేవంత్ రెడ్డి నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఇప్పటి వరకు ఈ పథకాన్ని అనేక మంది సిఎంలు అమలు చేసి విద్యార్థులు, ప్రజల మన్నలు పొందారని, ఈ పథకాన్ని రద్దు చేసేందుకు ప్రయత్నిస్తే రాష్ట్రం రావణకాష్టంగా మారుతుందని, సిఎం పదవికే ప్రమాదం వస్తుందని అన్నారు. శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో జాతీయ బిసి సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ ర్యాగ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఫీజు రీయంబర్స్మె ంట్ పథకంపై జరిగిన అఖిల పక్ష సమావేశంలో ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 33 నెలలు కావస్తున్నదని, ఇంత వరకు ఫీజుల రీయంబర్స్మెంట్ వథకానికి నిధులు కేటాయించకుండా ఈ పథకాన్ని ఎత్తివేసేందుకు సిఎం కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. మద్యం ద్వారా 50 వేల కోట్ల ఆదాయం వస్తున్నదని,పేద విద్యార్థులు చదువుకోవడానికి ఏడాదికి 2 వేల కోట్ల రూపాయలు కేటాయించడం ఏమంత భారం కాదని అన్నారు. ఈ పథకం ద్వారా ప్రతి ఏడాది 14 లక్షల మంది విద్యార్థులు చదువుకుని విజ్ఞానవంతులు, చైతన్యవంతులు అవుతున్నారని, కానీ పేద విద్యార్థులు చదువుకోవడం సిఎంకు ఇష్టం లేదని అన్నారు. ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి ఈ పథకాన్ని కాపాడుకుంటామని ఆయన హెచ్చరించారు. రాష్ట్ర శాసన మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ప్రసంగిస్తూ, ప్రజాస్వామ్య ముసుగులో ఫీజుల రీయంబర్స్ మెంట్ పథకానికి నిధులు కేటాయించకపోవడం వెనుక కుట్ర దాగి ఉందని ఆరోపించారు. అలాగే బిసిలు 50, 60 కోట్లు ఖర్చు చేసి ఎన్నికల్లో నిలబడనీయకుండా చేయడం, రాజ్యాధికారంలోకి రానీయకుండా కుట్ర జరుగుతున్నదని ఆయన విమర్శించారు. డాక్టర్ ర్యాగ అరుణ్ కుమార్ మాట్లాడుతూ బిసిచేయడం, రాజ్యాధికారానికి రానీయకుండా కుట్ర జరుగుతున్నదని ఆయన విమర్శించారు. డాక్టర్ ర్యాగ అరుణ్ కుమార్ మాట్లాడుతూ బిసి సంక్షేమ సంఘం యువతను మహిళలను ప్రోత్సహిస్తున్నదని చెప్పారు. ఇటీవల లండన్ బిసి సంక్షేమ సంఘం సమావేశం జరిగిందని, త్వరలో వివిధ దేశాల్లో జరుగుతుందన్నారు. ఎన్ఆర్ఐలు ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉత్సాహం చూపిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం 2,026 పాఠశాలలను మూసివేసి మద్యం బెల్ట్ షాపుల సంఖ్యను పెంచిందని ఆరోపించారు. ఎన్నికల్లో బీర్లు, బిర్యానీలు, డబ్బుల పంపకాన్ని నిరోధించేందుకు సుప్రీంకోర్టు తగిన ఆదేశాలను జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏఐసిసి నేత కత్తి వెంకటస్వామి మాట్లాడుతూ, జీవో నెంబరు 7 రద్దు కోసం, ఫీజుల రీయంబర్స్ మెంట్ పథకం అమలు కోసం సిఎం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో బిజెపి ఓబిసి రాష్ట్ర అధ్యక్షుడు గందమళ్ళ ఆనంద్ గౌడ్, రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు వి.జి.ఆర్. నారగోని, సంఘం జాతీయ నాయకుడు గుజ్జ సత్యం తదితరులు ప్రసంగించారు. అనంతరం ఆర్. కృష్ణయ్య జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా షెట్టి వంశీ మోహన్ యాదవ్ ను నియమించి, నియామకపత్రాన్ని అందజేశారు.

# మున్సిపల్ అభివృద్ధికి పెద్దపీట
## రూ. 158 కోట్లతో ఆదిలాబాద్ మున్సిపల్ బడ్జెట్ ప్రతిపాదనలు



ఆదిలాబాద్: పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు.స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్ సమావేశాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష తో కలిసి ఆయన నిర్వహించారు. ఈ సమావేశంలో రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయ వ్యయాలపై సుదీర్ఘంగా చర్చించి, మొత్తంరూ. 157.97 కోట్లతో (సుమారు రూ.158 కోట్లు) అంచనా ఆదాయ వ్యయాలకు కౌన్సిల్ ఆమోదంతో ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందన్నారు.ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపాలిటీ పురోభివృద్ధిలో బడ్జెట్ అత్యంత కీలకమని, గత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను ఎంతవరకు చేరుకున్నామో సమీక్షించుకుంటూ, కొత్త సంవత్సరానికి తగిన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. మున్సిపాలిటీ ఆదాయ వనరులను పెంచుకోవడంతో పాటు, అనవసర ఖర్చులను తగ్గించుకోవాలని కలెక్టర్ సూచించారు. మున్సిపాలిటీలో పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి మౌలిక సదుపాయాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అమృత్ పథకం కాల పరిమితిని మరో ఏడాది పొడిగించినట్లు, దీని ద్వారా పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, మంచినీటి పనులను పూర్తి చేస్తామని తెలిపారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా కార్మికుల జీతాలు, వాహనాల నిర్వహణ కోసం బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించినట్లు వివరించారు. గ్రీన్ బడ్జెట్ కింద మున్సిపల్ చట్టం ప్రకారం 10% నిధులను పచ్చదనం పెంచడానికి కేటాయించడం జరిగిందన్నారు. ప్రభుత్వ గ్రాంట్లు, మున్సిపల్ సొంత ఆదాయం మధ్య సమతుల్యత పాటిస్తూ పారదర్శకమైన బడ్జెట్‌ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కౌన్సిల్ సభ్యులు బడ్జెట్ అంశాలపై చర్చించి, వార్డుల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక అమలులో వార్డు కౌన్సిలర్లు చురుకైన పాత్ర పోషించాలని, జిల్లా యంత్రాంగం తరపున మున్సిపాలిటీకి పూర్తి సహకారం ఉంటుందని కలెక్టర్ హామీ ఇచ్చారు.

# యాసంగి ధాన్యం ప్రతి గింజ కొనుగోలు చేయాలి: జిల్లా కలెక్టర్

భద్రాద్రి బ్యూరో (తెలంగాణ వాణి) యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహిస్తూ రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ తో కలసి కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జులు, వ్యవసాయ, సహకార, డీఆర్‌డీఏ, తూనికలు–కొలతలు, రవాణా, మార్కెటింగ్ శాఖ అధికారులు, సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1,87,309 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా ఉన్నదని, అందులో సన్న రకం 1,35,365 మెట్రిక్ టన్నులు, దొడ్డు రకం 51,944 మెట్రిక్ టన్నులు ఉన్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో 168 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, అవసరాన్ని బట్టి అదనపు కేంద్రాలు కూడా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం ధాన్యాన్ని ఏ, బి గ్రేడ్‌లుగా విభజించి మద్దతు ధరలు నిర్ణయించినట్లు తెలిపారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2389, బి గ్రేడ్‌కు రూ. 2369 ధరలు నిర్ణయించగా, సన్న రకం వడ్లకు అదనంగా రూ. 500 బోనస్ ఇవ్వబడుతుందని వెల్లడించారు. ఈ సంవత్సరం ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు, హమాలీలు ఎండబారకుండా టెంట్లు, షెడ్ నెట్‌లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేసి తగిన నీడ కల్పించాలని సూచించారు. తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రద్దీ నియంత్రణ కోసం క్రాప్ బుకింగ్ ఆధారంగా రైతులకు టోకెన్లు జారీ చేయాలని, అవసరమైన ఏర్పాట్లపై చెక్‌లిస్ట్ జారీ చేసి, దాని ప్రకారం చర్యలు తీసుకొని ధృవీకరణ నివేదికలు సమర్పించాలని సూచించారు. సరిహద్దు రాష్ట్రాల నుండి అక్రమంగా ధాన్యం రాకుండా జిల్లాలో చెక్‌పోస్టుల ద్వారా పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని అదే రోజు ఆన్‌లైన్ నమోదు చేసి రైస్ మిల్లులకు తరలించాలని, రవాణాలో జాప్యం జరగకుండా మిల్లర్లు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

## ఏటీఎం నగదు డ్రా చేస్తున్నారా?
# ఈ మార్పులు తెలుసుకోండి!

హైదరాబాద్:రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా 2026–27 ఆర్థిక సంవత్సరం ప్రారంభమయ్యే ఏప్రిల్ 1 నుంచి దేశవ్యాప్తంగా బ్యాంకింగ్ నిబంధనల్లో పలు కీలక మార్పులు అమల్లోకి రాబోతున్నాయి. నగదు వినియోగాన్ని తగ్గించి, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించే లక్ష్యంతో హెచ్‌డీఎఫ్‌సీ, పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) వంటి ప్రధాన బ్యాంకులు ఏటీఎం విత్‌డ్రా పరిమితులు, సేవా రుసుములను సవరించాయి.
ఉచిత పరిధిలోకి యూపీఐ విత్‌డ్రాలు: ఇప్పటివరకు ఏటీఎంలలో క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి యూపీఐ ద్వారా నగదు తీసుకునే సదుపాయంపై ప్రత్యేక ఛార్జీలు ఉండేవి కావు. అయితే ఏప్రిల్ 1 నుంచి ఈ విధానంలో మార్పు రానుంది. యూపీఐ ఆధారిత నగదు ఉపసంహరణలను కూడా నెలవారీ ఉచిత ఏటీఎం లావాదేవీల కోటాలోనే చేర్చనున్నట్లు హెచ్‌డీఎఫ్‌సీ వంటి బ్యాంకులు ప్రకటించాయి. ఖాతాదారులు తమకు నిర్దేశించిన ఉచిత పరిమితిని దాటితే, యూపీఐ ద్వారా చేసే ప్రతి విత్‌డ్రాపై రూ. 23తో పాటు అదనపు పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. సాధారణంగా మెట్రో నగరాల్లో ఇతర బ్యాంక్ ఏటీఎంలలో 3, నాన్–మెట్రో నగరాల్లో 5 ఉచిత లావాదేవీలకు అవకాశం ఉన్న విషయం తెలిసిందే.
పీఎన్‌బీ విత్‌డ్రా లిమిట్‌లో భారీ కోత: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) తమ డెబిట్ కార్డులపై రోజువారీ నగదు విత్‌డ్రా పరిమితిని భారీగా తగ్గించింది. ప్లాటినం, గోల్డ్, బిజినెస్ కార్డుల పరిమితిని రూ. 1,00,000 నుంచి రూ. 50,000కు తగ్గించారు.



అదేవిధంగా, సెలెక్ట్, సిగ్నేచర్ కార్డుల పరిమితిని రూ. 1,50,000 నుంచి రూ. 75,000కు కుదించారు. అంటే, దాదాపు 50 శాతం మేర పరిమితుల్లో కోత విధించారు. మరోవైపు బంధన్ బ్యాంక్ కూడా పరిమితి మించిన లావాదేవీలపై రూ. 10 చొప్పున వసూలు చేయనున్నట్లు తెలిపింది.
భద్రత పెంపు, డిజిటల్ ప్రోత్సాహం: ఆన్‌లైన్ మోసాలను అరికట్టేందుకు ఓటీపీతో పాటు పిన్ లేదా బయోమెట్రిక్ వంటి రెండంచెల భద్రతను తప్పనిసరి చేశారు. నగదుపై ఆధారపడటాన్ని తగ్గించడం, బ్యాంకుల నిర్వహణ వ్యయాలను నియంత్రించడమే ఈ మార్పుల ముఖ్య ఉద్దేశమని బ్యాంకింగ్ వర్గాలు వివరిస్తున్నాయి. వినియోగదారులు మారిన నిబంధనలను గమనించి, అనవసర ఛార్జీల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని సూచిస్తున్నాయి.

# భారీగా తగ్గిన ఇంజనీరింగ్ అప్లికేషన్స్

హైదరాబాద్: రాష్ట్రంలో 2026–27 విద్యా సంవత్స రానికి సంబంధించి ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీజీ ఈఏపీసెట్ 2026 ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ఆలస్య రుసుములేకుండా ఏప్రిల్ 4తో ముగియనున్నాయి. ఈ క్రమంలో ఈసారి ఈఏపీసెట్ దరఖాస్తుల సంఖ్య తగ్గే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. మార్చి 28 నాటికి ఇంజినీరింగ్‌కు 1,78,442 మంది, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగానికి 73,782 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఆలస్య రుసుం లేకుండా దరఖాస్తు చేసుకునే గడువు ఏప్రిల్ 4తో ముగుస్తుంది. అంటే మరో 6 రోజులే సమయం ఉంది. ఆ తర్వాత ఆలస్య రుసుంతో మే 2 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అయినప్పటికీ గత కొన్నేళ్ల గణాంకాలను పరిశీలిస్తే ఆ సంఖ్య 6 వేలకు మించదని తెలుస్తుంది. గత ఏడాది ఇంజినీరింగ్ విభాగానికి ఏకంగా 2.20 లక్షల దరఖాస్తులు అందాయి. ఇక అగ్రికల్చర్‌కు దాదాపు 87 వేలు వస్తాయి. మొత్తం కలిపి 3.07 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈసారి ఇంజినీరింగ్‌కు 2 లక్షలు, అగ్రికల్చర్‌కు 80 వేల మంది లోపే దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.



దీంతో దాదాపు 30 వేల వరకు దరఖాస్తులు తక్కువగా వచ్చే అవకాశం ఉందని ఎప్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ కె విజయకుమార్‌రెడ్డి తెలిపారు.గత ఏడాది ఏపీ విద్యార్థులు భారీగా దరఖాస్తు చేసుకోవడం వల్ల దరఖాస్తుల సంఖ్య పెరిగింది. ఈఏపీసెట్ ఇంజినీరింగ్ విభాగం పరీక్షలు మే 9 నుంచి 11 వరకు జరుగుతాయి. ఇక ఆ మరుసటి రోజు నుంచే అంటే మే 12 నుంచి ఏపీ ఇంజినీరింగ్ విభాగం పరీక్షలు మొదలవుతాయి. దీంతో ఈసారి ఏపీ విద్యార్థుల సంఖ్య తగ్గింది. గత ఏడాది ఇంజినీరింగ్‌కు 17,834 మంది, అగ్రికల్చర్‌కు 2,877 మంది ఇతర రాష్ట్రాల విద్యార్థులు దరఖాస్తు చేశారు. ఈసారి ఇప్పటివరకు ఇంజినీరింగ్‌కు 8 వేలు, అగ్రికల్చర్‌కు 1400 మంది మాత్రమే దరఖాస్తు చేశారు.ఆలస్య రుసుము లేకుండా దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 4, 2026. రూ.250 ఆలస్య రుసుముతో దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 10, 2026. రూ.500 ఆలస్య రుసుముతో దరఖాస్తుకు చివరి తేదీ:
ఏప్రిల్ 15, 2026. రూ.2,500 ఆలస్య రుసుముతో దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 20, 2026. రూ.5,000 ఆలస్య రుసుముతో దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 24, 2026. రూ.10,000 ఆలస్య రుసుముతో దరఖాస్తుకు చివరి తేదీ: మే 2, 2026 వరకు.దరఖాస్తు సవరణ: ఏప్రిల్ 6 నుంచి 8 వరకు. అగ్రికల్చర్, ఫార్మసీ హాల్‌టికెట్ డౌన్‌లోడ్ తేదీ: ఏప్రిల్ 23, 2026. ఇంజినీరింగ్ హాల్‌టికెట్ డౌన్‌లోడ్ తేదీ: ఏప్రిల్ 27, 2026. అగ్రికల్చర్ ఌ ఫార్మసీ పరీక్ష తేదీలు: మే 4, 5 తేదీల్లో.ఇంజినీరింగ్ పరీక్ష తేదీలు: మే 9 నుంచి మే 11 వరకు.

## ఇక పదవులే.. పదవులు

విజయవాడ, : రాజకీయం చేయాలంటే అవకాశాలు దక్కాలి. అవకాశాలు దక్కాలంటే రాజకీయం చేయాలి. అయితే ఉన్న పదవుల తక్కువ.. నేతలు ఎక్కువ అన్నట్టు పరిస్థితి ఉండేది. అయితే ఆంధ్రప్రదేశ్లో నియోజకవర్గాల పునర్విభజనతో కేవలం ఎమ్మెల్యేలు, ఎంపీల సీట్లు మాత్రమే కాదు వందలాది పదవులు పుట్టుకొస్తాయి. వందలాదిమంది కొత్త ముఖాలు రాజకీయాల వైపు వస్తాయి. ఆర్థికంగా ఉన్నవారు.. పారిశ్రామికవేత్తలు ఇలా అందరూ రాజకీయాల వైపు రావడం ఖాయం. ఎందుకంటే గత 20 ఏళ్లుగా అదే జరుగుతోంది. ఇప్పుడు ఈ పదవుల పెంపుతో సైతం అదే జరగనుంది. ప్రస్తుతం ఏపీలో 175 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. పునర్విభజనతో మరో 80 సీట్లు పెరుగుతాయి. పార్లమెంట్ స్థానాలు 25 ఉన్నాయి.

# సంపాదకీయం

## మారుతోన్న బెంగాల్..

భారత సరిహద్దులో అత్యంత కీలకమైన చికెన్ నెక్ కేంద్రం చేతుల్లోకి వచ్చింది. పశ్చిమ బెంగాల్‌ను ఈశాన్య రాష్ట్రాలతో అనుసంధానం చేసే కీలకమైన 'చికెన్ నెక్' (సిలిగురి కారిడార్) ప్రాంతంపై కేంద్ర ఏజెన్సీల నియంత్రణ పెరిగే ముఖ్యమైన అభివృద్ధి చోటు చేసుకుంది. ఈ ప్రాంతంలోని సుమారు 120 ఎకరాల భూమి, జాతీయ రహదారి మార్గాలను బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీ ఎస్ ఎఫ్)కు అప్పగించాలని సువేందు అధికారి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో 22 కి.మీ. పొడవైన ఈ సంవేదనాత్మక ప్రాంతంపై కేంద్రం పట్టు మరింత బలపడనుంది. చికెన్ నెక్ అనేది భౌగోళికంగా చాలా సన్నటి, వ్యూహాత్మకంగా అత్యంత ముఖ్యమైన కారిడార్. ఇది పశ్చిమ బెంగాల్‌ను అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, నాగాలాండ్, మిజోరం, త్రిపుర వంటి ఈశాన్య రాష్ట్రాలతో అనుసంధానం చేస్తుంది. ఈ ప్రాంతం ఈశాన్య భారత అభివృద్ధికి 'జీవనాడి'లాంటిది. బంగ్లాదేశ్ సరిహద్దుతో పొరుగున ఉన్నందున, ఇక్కడ భద్రతా సవాళ్లు ఎక్కువ. సరిహద్దు అతిక్రమణలు, చొరబాట్లు, మాదకద్రవ్యాల స్మగ్లింగ్, ఇతర అనుచిత కార్యకలాపాలకు ఈ ప్రాంతం లక్ష్యంగా మారే అవకాశం ఉంది. తాజా నిర్ణయం ద్వారా భద్రతా దృక్పథం మార్చాలని అధికారులు భావిస్తున్నారు. స్థానిక అంతరాయాలు తగ్గి, భద్రతా బలగాలకు స్వేచ్ఛగా కదలికలు సాధ్యమవుతాయి. బంగ్లాదేశ్ నుంచి వచ్చే సంభావ్య బెదిరింపులను సమర్థవంతంగా ఎదుర్కొనవచ్చు. ఈ చర్య దేశ భద్రతా దృక్పథంలో భాగంగా చూడాలి. ఇటీవలి కాలంలో సరిహద్దు ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో ఇలాంటి నిర్ణయాలు అవసరమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారఅరాచకం నుంచి మొదలు పెడితే అన్యాయం వరకు.. అక్రమం నుంచి మొదలుపెడితే దుర్మార్గం వరకు.. దౌర్జన్యం నుంచి మొదలుపెడితే హింస వరకు.. ఇలా ఎన్ని పదాలుంటే అన్ని పదాలు.. వెస్ట్ బెంగాల్లో మమతా పరిపాలనకు సరిపోవు. గుండా రాజ్ దర్జాగా సాగింది. రక్తపాతం అడ్డు లేకుండా నడిచింది. 15 సంవత్సరాలు పాటు వెస్ట్ బెంగాల్ రావణకాష్టం లాగా రగిలిపోయింది. 15 సంవత్సరాలుగా అడ్డుకుంటూనే ఉంది.. జాతి ప్రయోజనాలు ఆమెకు అవసరం లేదు. దేశ ప్రయోజనాలు అవసరం లేదు. ఆమెకు కావాల్సింది ఓటు బ్యాంకు రాజకీయాలు. తన అధికారం కోసం.. ఆ అధికారాన్ని సుస్థిరం చేసుకోవడం కోసం ఏకంగా దేశ ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టింది. చివరికి 15 సంవత్సరాల పాటు దేశ భద్రతతో ఆడుకుంది. చివరికి పాపం పండి ఓడిపోయింది. 15 సంవత్సరాల పరిపాలన కాలంలో వెస్ట్ బెంగాల్లో మమత బెనర్జీ సృష్టించిన అరాచకాలు మామూలువి కావు. చివరికి తన అధికారాన్ని పదిలం చేసుకోవడానికి బంగ్లాదేశ్ మంచి వచ్చిన వారికి ఓటు హక్కు.. ఆధార్ కార్డు వంటి సదుపాయాలు కల్పించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఒక మతం వారికి విపరీతమైన ప్రయారిటీ ఇచ్చినట్టు తెలుస్తోంది. దీంతో బెంగాల్ రాష్ట్రం పూర్తిగా అదుపు తప్పిపోయింది. కేంద్రం పాటు లేకుండా పోయింది. దేశ భద్రతపరంగా అత్యంత సున్నితమైన ఈ రాష్ట్రంలో అక్రమ చొర బాట్లు నిత్యం జరగడం మొదలుపెట్టాయి. చివరికి మమత ఆగడాలు తట్టుకోలేక అక్కడి ప్రజలు ఇటీవల ఎన్నికల్లో బిజెపికి అధికారాన్ని కట్టబెట్టారు. ఫలితంగా అక్కడ విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. బెంగాల్ రాష్ట్రంలో చికెన్ నెక్ రహదారి అత్యంత ముఖ్యమైనది. నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, చైనా వంటి దేశాలకు ఇది సరిహద్దుగా ఉంది. ఈ రహదారి పొడవు 122 కిలోమీటర్లు ఉంటుంది. 22 కిలోమీటర్ల వెడల్పు ఉంటుంది. దీని భద్రతను ఇకపై బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ చూసుకుంటుంది.. ఈ కారిడార్ చుట్టూ బిఎస్ఎఫ్ కంచె నిర్మిస్తుంది. దీనివల్ల సరిహద్దు దేశాల నుంచి చొరబాట్లు రాకుండా ఉంటాయి.. కేవలం చైనా, భూటాన్, నేపాల్, బంగ్లాదేశ్ మాత్రమే కాకుండా.. మనదేశంలో ఉన్న ఈశాన్య రాష్ట్రాలకు కనెక్టివిటీ పెంచడంలో చికెన్ నెక్ రహదారి అత్యంత కీలకం.. ఈ రహదారికి సంబంధించిన 120 ఎకరాలను వెస్ట్ బెంగాల్ ముఖ్యమంత్రి సుబేందు అధికారి బిఎస్ఎఫ్ కు అప్పగించారు. 15 సంవత్సరాల పాటు ఇలా ఇవ్వకుండా మమతా బెనర్జీ కేంద్రాన్ని ఇబ్బంది పెట్టింది. సుబేందు మాత్రం కేవలం 15 నిమిషాల్లోనే దీనిని బిఎస్ఎఫ్ కు ఇస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ కారిడార్ పరిధిలో ఉన్న ఏడు ప్రాంతాలలో రోడ్లను నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అత్యంత ఆధునిక పద్ధతిలో నిర్మిస్తుంది. ఈ ప్రాంతంలో వర్షాలు పడటం వల్ల కొండ చరియలు విరిగిపడేవి. దీంతో ఈశాన్య రాష్ట్రాలకు రాకపోకలు అంతగా ఉండేవి కాదు. ఈ రహదారిని అప్పగించాలని కేంద్రం అనేక సందర్భాలలో విజ్ఞప్తి చేసినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. మమత ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. చివరికి ప్రజలకు ఆగ్రహం కలిగి. మమత పరిపాలనకు ఎండ్ కార్డు పడింది. అయితే ఇక్కడే ఆమె అక్రమ పరిపాలనకు సంబంధించిన ఒక్కొక్క అంశాలు ఇప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు విడుదలైన తర్వాత బెంగాల్ రాష్ట్రంలో టిఎంసి కార్యాలయాలు మూతపడ్డాయి. మొన్నటిదాకా ఒక వెలుగు వెలిగిన ఆ కార్యాలయాలు ఇప్పుడు అమావాస్య చీకటిని తలపిస్తున్నాయి. ఇటీవల కోల్కతా నగరంలోని బిధాన్ నగర్ పరిధిలోని డివిజన్ కార్యాలయాన్ని తెరిచారు. అందులో కుప్పలుగా ఆధార్ కార్డులు బయటపడ్డాయి. అవన్నీ కూడా పోస్టల్ శాఖ ద్వారా ప్రజలకు అందాల్సి ఉంది. వాటిని అందకుండా టీఎంసీ కార్యకర్తలు తమ వద్ద ఉంచుకున్నారు. ఆ ఆధార్ కార్డులు మొత్తం బిజెపి కార్యకర్తలవి. పశ్చిమ బెంగాల్లో ఎలక్షన్ కమిషన్ సర్ అనే విధానాన్ని అవలంబించింది. అందులో ఆధార్ కార్డును కూడా స్వీకరించింది. ఆధార్ కార్డును అందకుండా చేసి బిజెపి కార్యకర్తల ఓట్లను దూరం చేయాలని మమతా బెనర్జీ పార్టీ కార్యకర్తలు భావించారు. ఎన్నికల్లో బిజెపి అధికారం సాధించిన తర్వాత.. తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్పడిన అన్యా యం వెలుగులోకి వచ్చింది. అయితే ఇది కేవలం ఒక వార్డు పరిధిలోనే కాకుండా.. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి పరిస్థితి ఉందని అక్కడి బిజెపి నాయకులు చెబుతున్నారు. ఆధార్ కార్డులను దగ్గర పెట్టుకొని బిజెపి కి ఓట్లు పడకుండా చేసేందుకు టీఎంసీ కార్యకర్తలు అనేక రకాలుగా అక్రమాలకు పాల్పడ్డారు. చివరికి పోస్టల్ శాఖను కూడా తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. ఆధార్ కార్డులను అందకుండా చేశారు.. ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినప్పటికీ మమతా బెనర్జీ పార్టీ కార్యకర్తల దుర్మార్గాలు సాగలేదు. చివరికి ప్రజాస్వామ్యంలో అణిచివేతకు అవకాశం లేదని బెంగాల్ ప్రజలు తీర్పు చెప్పాచివరికి బెంగాల్ రాష్ట్రంలో ఇప్పుడు ప్రభుత్వం మారడంతో చికెన్ నెక్ రహదారి బిఎస్ఎఫ్ ఆధీనంలోకి వచ్చేసింది.

# అడుగుకో అవినీతి తిమింగళం!

హైదరాబాద్, : :హైదరాబాద్ జలమండలి జనరల్ మేనేజర్ కుమార్ నివాసాలపై జరిగిన ఏసీబీ దాడులు, అక్కడ బయటపడిన రూ. 100 కోట్ల అక్రమ ఆస్తుల ఉదంతం నగరంలో అవినీతి ఏ స్థాయిలో వేళ్లూనుకుందో మరోసారి నిరూపించింది. నెలకు లక్షన్నర రూపాయల పరిమిత జీతం తీసుకునే ఒక ప్రభుత్వ ఉద్యోగి, కొద్ది సంవత్సరాల వ్యవధిలోనే ఇంతటి భారీ సామ్రాజ్యాన్ని ఎలా నిర్మించగలిగారనే ప్రశ్న సామాన్యుడిని విస్మయానికి గురిచేస్తోంది. హైదరాబాద్ మహానగర పరిధిలోని ప్రభుత్వ శాఖలైన జీహెచ్ఎంసీ, జలమండలి, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ , టౌన్ ప్లానింగ్ విభాగాల్లో అవినీతి అనేది ఒక సమాంతర ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందింది. లంచాల రూపంలో వస్తున్న ఈ అక్రమ సొమ్మంతా మెట్రో నగర శివార్లలోని రియల్ ఎస్టేట్ రంగంలోకి అడ్డూఅదుపూ లేకుండా ప్రవహిస్తోంది. ఐటీ కారిడార్‌లోని విలాసవంతమైన గేటెడ్ కమ్యూనిటీ విల్లాలు, బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్లు, రీజినల్ రింగ్ రోడ్డు పరిసరాల్లోని వందలాది ఎకరాల ల్యాండ్ బ్యాంకులు మెజారిటీ భాగం ఇలాంటి కలుషిత సంపాదనతోనే కొనుగోలు చేస్తున్నారు. నిజాయితీగా సంపాదించే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు లేదా వ్యాపారవేత్తల కంటే, ఇరుకు గదుల్లో కూర్చునే అవినీతి ప్రభుత్వ అధికారులే నేడు రియల్ ఎస్టేట్ మార్కెట్‌ను శాసిస్తూ ధరలను కృత్రిమంగా పెంచుతున్నారు. అక్రమార్కులను పట్టుకోవడానికి ఏసీబీ దాడులు నిర్వహిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆ కేసుల పర్యవసానాలు శూన్యంగా మారుతున్నాయి. ఇటీవల వెలువడిన గణాంకాల ప్రకారం, తెలంగాణ ఏసీబీ నమోదు చేస్తున్న కేసుల్లో నిందితులకు కోర్టుల ద్వారా శిక్షలు పడుతున్న రేటు అత్యంత నిరాశాజనకంగా ఉంది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో శిక్షల శాతం కేవలం 20 నుండి 25 శాతం లోపే ఉంటోంది. అంటే, పట్టుబడిన ప్రతి పది మంది అవినీతి అధికారుల్లో కనీసం ఏడుగురు చట్టంలోనిలోపాల ద్వారా క్లీన్ చిట్‌తో బయటకు వస్తున్నారు లేదా కేసులను దశాబ్దాల పాటు సాగదీసి సాక్ష్యాలు లేకుండా చేస్తున్నారు. ఈ సేఫ్ ఎగ్జిట్ భరోసాయే అధికారులను మరింతగా బరితెగించేలా చేస్తోంది. ఈ వైఫల్యానికి ప్రధాన కారణం ఏసీబీ దర్యాప్తులో కనిపిస్తున్న లోపాలు . పక్కా సాక్ష్యాధారాలను కోర్టుల ముందుంచలేకపోవడమే. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో ఆస్తుల విలువను కట్టేటప్పుడు దర్యాప్తు అధికారులు మార్కెట్ విలువను కాకుండా పాత రిజిస్ట్రేషన్ విలువను ప్రామాణికంగా తీసుకోవడం నిందితులకు మేలు చేస్తోంది. బెనామీల పేరిట ఉన్న ఆస్తులకు, సదరు అధికారికి ఉన్న ఆర్థిక సంబంధాలను చట్టబద్ధంగా నిరూపించడంలో విఫలమవుతోంది. దీనికి తోడు, కేసు నమోదైన తర్వాత చార్జ్‌షీట్ దాఖలు చేయడానికే ఏసీబీకి సంవత్సరాల సమయం పడుతుండటంతో కీలక సాక్ష్యాలు కనుమరుగవుతున్నాయి. పట్టుబడిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంలో మరియు న్యాయస్థానాల్లో విచారణ జరపడానికి అవసరమైన ప్రభుత్వ అనుమతులు రావడంలో జరుగుతున్న జాప్యం అవినీతి నిరోధక చట్టం ఆత్మను దెబ్బతీస్తోంది. ఉన్నతాధికారుల, రాజకీయ నాయకుల అండదండలు ఉన్న లంచగొండులకు ఈ శాంక్షన్లు రాకుండా తెరవెనుక పెద్ద ఎత్తున లాబీయింగ్ సాగుతుంది. ఒకవేళ ఏసీబీ గట్టిగా ప్రయత్నించి సస్పెండ్ చేయించినా, కేవలం కొన్ని నెలల వ్యవధిలోనే వారు ట్రిబ్యునళ్లు లేదా కోర్టుల నుండి స్టేలు తెచ్చుకుని, తిరిగి అదే శాఖల్లో కీలకమైన పోస్టుల్లో కొలువుదీరుతున్నారు. జలమండలి కేసులోనూ గతంలో ఇలాంటి అనుభవాలే వెలుగుచూశాయి. అవినీతి అధికారులు తమ సంపాదనను కేవలం నగదు రూపంలో కాకుండా, ఇతర దేశాల్లో పెట్టుబడులు, క్రిప్టో కరెన్సీ లేదా సుదూర ప్రాంతాల్లో బినామీల పేరుతో భూములుగా మారుస్తున్నారు. ఏసీబీ వద్ద ఉన్న పాత తరం దర్యాప్తు పద్ధతులు ఈ ఆధునిక వైట్ కాలర్ నేరాలను ఛేదించలేకపోతున్నాయి. ఫోరెన్సిక్ ఆడిటింగ్ మరియు డిజిటల్ ఎవిడెన్స్ సేకరణలో ఏసీబీ బలోపేతం కాకపోవడం వల్ల, కోర్టుల్లో నిందితుల తరపు న్యాయవాదులు సాంకేతిక కారణాలతో కేసులను కొట్టివేయించగలుగుతున్నారు. దీనివల్ల పట్టుబడటం అనేది ఒక చిన్న ప్రమాదం మాత్రమే, శిక్ష పడటం అసాధ్యం అనే భావన అవినీతి తిమింగలాల్లో బలపడింది. ఏసీబీ కేవలం దాడుల నాటి హంగామాకే పరిమితం కాకుండా, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా ఏడాది లోపే నిందితుల ఆస్తులను జప్తు చేసే అధికారాలను పొందాలి. పట్టుబడిన వెంటనే ఆస్తులను ప్రభుత్వ పరం చేసే విధానం వస్తేనే భయం మొదలవుతుంది. ఏసీబీకి స్వయంప్రతిపత్తి కల్పించడంతో పాటు, ప్రాసిక్యూషన్ విభాగాన్ని అత్యున్నత స్థాయి న్యాయ నిపుణులతో బలోపేతం చేయాలి. అప్పుడే, లక్షల్లో జీతం ఉండి కోట్లలో ఆస్తులు కూడబెట్టే అధికారుల అక్రమ దాహానికి బ్రేకులు పడతాయన్న అభిప్రాయం వినిపిస్తోంది.

## అనంతలో తమ్ముళ్ల మధ్య లుకలుకలు

అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో తెలుగుదేశం పార్టీ అంతర్గత రాజకీయాలు రోజురోజుకు చర్చనీయాంశంగా మారుతున్నాయి. పార్టీ అధిష్టానం నాయకులంతా కలిసి పనిచేయాలని సూచిస్తున్నప్పటికీ, స్థానిక స్థాయిలో మాత్రం వర్గపోరు తగ్గే పరిస్థితి కనిపించడం లేదు. ముఖ్యంగా నామినేటెడ్ పదవుల నియామకాల తర్వాత కొన్ని నియోజకవర్గాల్లో నేతల మధ్య విభేదాలు మరింత స్పష్టంగా బయటపడుతున్నాయని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఈ విభేదాలు ఇప్పుడు బహిరంగ చర్చకు దారితీశాయి. మార్కెట్ యార్డ్ కమిటీ చైర్‌పర్సన్‌గా పల్లవి బాధ్యతలు చేపట్టిన తర్వాత స్థానిక రాజకీయాల్లో కొత్త సమీకరణాలు కనిపిస్తున్నాయి. మొదట్లో ఆమె సిట్టింగ్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ కు సన్నిహితంగా వ్యవహరించారని, ఆ కారణంగానే ఆమెకు పదవి లభించిందనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో వినిపించింది. అయితే తరువాత పరిస్థితులు మారిపోయాయి. కొన్ని వ్యవహారాల్లో ఎమ్మెల్యేకు, చైర్‌పర్సన్‌కు మధ్య అభిప్రాయ భేదాలు వచ్చినట్టు ప్రచారం సాగుతోంది. ఇదే సమయంలో మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరితో పల్లవి దగ్గరయ్యారనే చర్చ రాజకీయ వర్గాల్లో ఊపందుకుంది. దీంతో స్థానికంగా రెండు వర్గాల మధ్య పోటీ వాతావరణం మరింత పెరిగిందని అంటున్నారు. ఈ పరిణామాలను గమనించిన ఎమ్మెల్యే వర్గం మార్కెట్ యార్డ్ కమిటీలోని ఇతర సభ్యులను తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. కమిటీ కార్యకలాపాలు కూడా రెండు వర్గాల ప్రభావంతో సాగుతున్నాయని చెబుతున్నారు. సభ్యులు, చైర్‌పర్సన్ మధ్య సమన్వయం లేకపోవడం వల్ల సమావేశాలు, కార్యక్రమాలు కూడా సక్రమంగా జరగడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికే ఇష్టపడని పరిస్థితి ఏర్పడిందని స్థానిక నేతలు అంటున్నారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి వచ్చే ఎన్నికల్లో తిరిగి పోటీ చేయాలనే ఆలోచనలో ఉన్నారనే ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. అధికారికంగా ఆయన ఎలాంటి ప్రకటన చేయకపోయినా, తన అనుచరులతో సమావేశాలు నిర్వహించడం, స్థానికంగా అసంతృప్తిగా ఉన్న నేతలను దగ్గర చేసుకోవడం వంటి పరిణామాలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గత ఎన్నికల్లో టికెట్ ఆశించిన ఆయనకు అవకాశం రాకపోవడం, తర్వాత నామినేటెడ్ పదవి కూడా దక్కకపోవడం ఆయన వర్గంలో అసంతృప్తిని పెంచిందని భావిస్తున్నారు. ఈ పరిస్థితులు ఎమ్మెల్యే వర్గానికి అసహనాన్ని కలిగిస్తున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇరువర్గాల మధ్య విభేదాలు రోజు రోజుకూ తీవ్ర రూపం దాలుస్తుండటంతో పార్టీ కార్యకర్తలు కూడా అయోమయంలో పడుతున్నారని అంటున్నారు. సీనియర్ నేతలు ఇప్పటివరకు జోక్యం చేసుకోకపోవడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ అంతర్గత విభేదాలు భవిష్యత్తులో పార్టీపై ప్రభావం చూపే అవకాశముందని స్థానికంగా చర్చ జరుగుతోంది. పార్టీ అధిష్టానం సమయానికి స్పందించి నాయకుల మధ్య సమన్వయం తీసుకురాకపోతే ఎన్నికల సమయానికి సమస్య మరింత పెద్దదయ్యే అవకాశముందని పరిశీలకులు భావిస్తున్నారు

## ఇండియాలో 4 శాతమే పెరుగుదల..!



న్యూఢిల్లీ, : పశ్చిమాసియా యుద్ధంతో ప్రపంచ వ్యాప్తంగా చమురు సంక్షోభం నెలకొంది. హర్మూజ్ మూసివేతతో గల్ఫ్ నుంచి యురోపియన్ యూనియన్‌తోపాటు ఆసియాలోని వివిధ దేశాలకు ఇంధన సరఫరా ఆగిపోయింది. దీంతో చాలా దేశాలు ఇబ్బంది పడుతున్నాయి. అయితే ఇరాన్ శత్రు దేశాలు మినహా మిగతా ఓడలు వెళ్లడానికి అనుమతి ఇచ్చింది. అయితే హర్మూజ్‌లో ట్రాఫిక్ కారణంగా నౌకల ప్రయాణం క్లిష్టంగా మారింది. దీంతో చాలా దేశాలు చమురు ధరలు పెంచాయి. యుద్ధం ప్రారంభమైన రెండు నెలల తర్వాత భారత్ కూడా ఇంధన ధరలు పెంచింది. దీనిపై విపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 23 నుంచి మే 15 వరకు లీటర్ పెట్రోల్‌పై మయన్మార్ 89.7% వరకూ, లీటర్ డీజిల్‌పై 112.7% వరకూ ధరలు పెంచింది. ప్రపంచంలో ఇదే అత్యధిక పెంపు. ఇది గ్లోబల్ సరఫరాచైన్ కల్తీ, స్థానిక పాలనా వ్యవహారాలు లేదా కరెన్సీ సంక్షోభాల సంక్లిష్ట క్రియాచక్రాల ఫలితం కావచ్చు. చిన్న మార్కెట్లలో ఈ రకమైన భారీ ఒత్తిడి వాళ్ల ఆర్థిక వ్యవస్థలను నేలమాట చేస్తుంది. ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు దూకుడు, సరుకుల ధరలు అనూహ్యంగా పెరగటం, సాధ్యమైన సామాజిక అసంతృప్తికి కారణమవుతుంది. మన దాయాది దేశం పాకిస్తాన్‌లో పెట్రోల్ ధరలు 54.9 శాతం, డీజిల్ ధరలు 44.9 శాతం పెరిగాయి. మయన్మార్ తర్వాత పాకిస్తాన్‌లోనే గరిష్టంగా పెరిగింది. ఇక యూఏఈలో 52.4% (పెట్రోల్), 86.1% (డీజిల్) పెంపు, సాధారణంగా ఆయా దేశాల్లోని సబ్సిడీ తగ్గింపు లేదా గ్లోబల్ పెట్రోల్ వాహక ధరల ప్రభావం సూచిస్తుంది. అమెరికా వంటి పెద్ద మార్కెట్లలో పెట్రోల్ 44.5%, డీజిల్ 48.1% పెరగడం అనేది అంతర్జాతీయ పరిస్థితులకు అద్దం పడుతోంది. చైనా, ఫ్రాన్స్ నుంచి మధ్యంతర స్థాయిల వరకు చైనా (పెట్రోల్ 21.7%, డీజిల్ 23.7%), ఫ్రాన్స్ (పెట్రోల్ 20.9%, డీజిల్ 31%)లో మధ్యస్థాయిలో పెరగడం, వీరు ప్రపంచ ఆర్థిక సంక్షోభాల బరువును కొంత మినహాయించుకుని ఉన్నప్పటికీ ఇంకొంచెం బాధ్యత హామిలా ఉంటుందని చూపిస్తుంది. ఇవి ఉత్పత్తి కనెక్టెడ్ డిమాండ్ మార్పులు, సంచార విధానాల తాత్కాలిక అనీయతలతో కూడా రెట్టింపు కాదు. భారతంలో పెట్రోల్ ధర 4.2%, డీజిల్ 4.4% తక్కువగా కనిపిస్తుంది. ప్రభుత్వ సబ్సిడీలు లేదా పండిత కార్డుల ద్వారా ధరల నియంత్రణ కొనసాగడం. పౌర వాహనుల పై మోతాదులో డిమాండ్ పెరుగుదల కాకపోవడం లేదా స్థానిక మద్దతు విధానాలు. లేదా కరెన్సీ వాల్యూమ్స్, పర్థిత రిఫైనరీ అవుట్‌పుట్ పరిస్థితులు తాత్కాలికంగా భారత ధరలను వశీకరించినట్లై ఉంటుంది.

## మమతా రూపొందించిన ఫుట్‌బాల్ శిల్పం.. కూల్చేసిన బీజేపీ ప్రభుత్వం



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతాబెనర్జీ స్వయంగా రూపొందించిన భారీ ఫుట్‌బాట్ శిల్పాన్ని బీజేపీ ప్రభుత్వం కూల్చివేసింది. కోల్‌కతాలోని ప్రసిద్ధ సాల్ట్ లేక్ స్టేడియానికి గుర్తింపుగా ఉన్న ఈశిల్పం ధ్వంసం కావడం చూసి స్థానికులు నివ్వెరపోయారు. మమతా బెనర్జీ ఆలోచనతో రూపొందించిన ఆశిల్పాన్ని 2017లో ఫీఫా అండర్-17 ప్రపంచ కప్‌కు ముందు ఏర్పాటు చేశారు. గత టీఎంసీ ప్రభుత్వపు చిహ్న మైన 'బిస్వా బంగ్లా' లోగో కూడా కూడా దీనిపై ఉన్నది. కాగా, మొండెంపై ఫుట్‌బాల్ ఉన్న ఈ స్టాట్యూపై పలు విమర్శలు కూడా వచ్చాయి. దీనిని ఆవిష్కరించినప్పటి నుంచి వివాదాస్పదంగా మారింది. ఈ విచిత్ర డిజైన్‌ను పలువురు ఫుట్‌బాల్ అభిమానులు ప్రశ్నించారు. అయినప్పటికీ అనేక ప్రతిష్టాత్మక ఫుట్‌బాల్ టోర్నీలకు ఆతిథ్యం ఇచ్చిన ఈ స్టేడియానికి ఒక గుర్తింపుగా అది నిలిచింది.

మరోవైపు బెంగాల్‌లో బీజేపీ తొలి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సువేందు అధికారి, ఆ మరునాడే ఈ నిర్మాణాన్ని తొలగిస్తామని ప్రకటించారు. క్రీడల మంత్రి నిసిత్ ప్రమాణిక్ కూడా ఈ విషయాన్ని పునరుద్ఘాటించారు.

ప్రఖ్యాతస్టేడియం సౌందర్యానికి ఆ 'వికృతమైన' నిర్మాణం ఏమాత్రంతగినదికాదని వ్యాఖ్యానిం చారు. ఈ నేపథ్యంలో బీజేపీ ప్రభుత్వం ఈశిల్పాన్ని కూల్చివేసింది. ఇటీవల ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ ఆతిథ్యం ఇచ్చిన సాల్ట్ లేక్ స్టేడియం వీవీఐపీ గేటు సమీపంలో ఉన్నఈ శిల్పాన్ని ఉదయం తొలగించడం చూసి స్థానికులు ఆశ్చర్యపోయారు. 'సాల్ట్‌లేక్ స్టేడియం ముందున్న ఆ అసహ్యకరమైన నిర్మాణం గుర్తుందా? మాటిచ్చినట్లుగానే దానిని తొలగించాం' అని బీజేపీ నాయకురాలు కీయా ఘోష్ ట్వీట్ చేశారు.

## వైఎస్ రాజారెడ్డి అరచకాలు అన్నీఇన్నీకావు

### జగన్ వ్యాఖ్యలపై మండిపడ్డ అనకాపల్లి ఎంపి సిఎం రమేశ్

అమరావతి, : పులివెందులలో వైఎస్ రాజారెడ్డి చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావని బీజేపీ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ చెప్పుకొచ్చారు. వైఎస్ ఎలా చనిపోయారో అందరికీ తెలుసునని... ఈ విషయంలో జగన్ సెల్ఫ్ గోల్ వేసుకున్నారని సెటైర్లు గుప్పించారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై బీజేపీ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి తండ్రి రాజారెడ్డిపై కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రౌడీషీట్ ఉందని విమర్శించారు. ఓ కులాన్ని అడ్డం పెట్టుకుని దొంగతనాలు చేయించి డబ్బు గడించిన చరిత్ర రాజారెడ్డిదని ఎద్దేవా చేశారు. అమరావతి వేదికగా మీడియాతో ఎంపీ రమేశ్ మాట్లాడారు. ఓ మైన్ ఓనర్‌ను అంతమొందించి రాజారెడ్డి గనులు దక్కించుకుని ధనవంతుడయ్యారని విమర్శించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి మరణాన్ని, మాజీ మంత్రి వివేకారెడ్డి మరణాన్ని జగన్ వేరేలాగా చిత్రీకరిస్తున్నారని ఎంపీ రమేశ్ అన్నారు. వివేకా హత్య కేసులో జగన్ హస్తం ఉందా..?, లేదా..? అనేది ఓపెన్ పోల్ పెట్టాలని సవాల్ చేశారు. ఈ కేసుతో జగన్‌కి సంబంధం లేదని వస్తే తాను రాజకీయాలు వదిలేస్తానని ఛాలెంజ్ చేశారు. ప్రజలకు జగన్ హత్యా రాజకీయాల గురించి తెలిసిపోయిందని.. అందుకే ఆయన ఇప్పుడు తాను మంచివాడిని అని చెబుతున్నారని అన్నారు. వివేకా కేసులో సీబీఐ విచారణ చేసి భాస్కర్ రెడ్డిని అరెస్ట్ చేసిందని ప్రస్తావించారు. ఎస్టీ కులాన్ని అడ్డుపెట్టుకుని రాజారెడ్డి దోపిడీలు చేశారని.. ఇలా పోలీసుల రికార్డుల్లో కూడా ఉందని గుర్తుచేశారు. పులివెందులలో పార్నపల్లి గ్రామంలో రాజారెడ్డి చేసిన ఆకృత్యాలకు ఇంకా సజీవ సాక్షులు ఉన్నారని చెప్పుకొచ్చారు. రాజారెడ్డి ఎందరినో రాజకీయ లబ్ధి కోసం హత్య రాజకీయాలు చేశారని ఆరోపించారు. రాజారెడ్డిని హత్య చేసింది ఆయన వల్ల ఇబ్బంది పడిన బాధితులేనని చెప్పుకొచ్చారు.

## పవన్‌తో పోలవరం ఎమ్మెల్యే భేటీ

**నియోజకవర్గ అభివృద్ధి తదితరాలపై చర్చ**

**అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేయాలని సూచన**

అమరావతి:ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా.. పోలవరం ఎమ్మెల్యేగా ఆయన పని తీరుపై డిప్యూటీ సీఎం సమీక్ష నిర్వహించారు. పోలవరం నియోజకవర్గం పరిధికి సంబంధించి పార్టీ దృష్టికి వచ్చిన విషయాలు, ఆరోపణలపై ఎమ్మెల్యేను పవన్ వివరణ అడిగినట్లు తెలుస్తోంది. తన వ్యక్తిగత విషయాలను కుటుంబ సభ్యులతో కలిసి కూర్చొని చక్కదిద్దుకొనేందుకు కొంత గడువు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరగా.. నాలుగు వారాల్లోగా చక్కదిద్దుకోవాలని పవన్ సూచించినట్లు సమాచారం. పోలవరం నియోజకవర్గంలో పంచాయతీల్లో అభివృద్ధి పనులకు ఇప్పటి వరకు రూ. 147 కోట్లు కేటాయించారు. ఆ పనుల పురోగతిపైనా డిప్యూటీ సీఎం సమీక్ష చేశారు. పనుల సకాలంలో వేగంగా పూర్తి చేయకపోవడంపై పవన్ ప్రశ్నించారు. అధికారులను సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేస్తానని, వ్యక్తిగత వ్యవహారాలు చక్కదిద్దుకోవాలని సూచించినట్లు సమాచారం.




# నడకే దివ్యౌషధం




జీవనశైలిలో మార్పులు, శారీరక శ్రమ తగ్గడం వల్ల.. హృద్రోగ బాధితులు పెరుగుతున్నారు. 30 ఏండ్లకే గుండె జబ్బులను స్వాగతిస్తున్నారు. ఇలాంటివారు సరైన జీవనశైలిని పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా, నడకను దినచర్యలో భాగం చేసుకుంటే.. హృదయం తేలికపడుతుందని అంటున్నారు. రోజూ కనీసం అరగంట వాకింగ్ చేస్తే.. ఆరోగ్యాన్ని నియంత్రణలో ఉంచుకోవచ్చని చెబుతున్నారు. గుండె జబ్బు వచ్చిందంటే.. వ్యాయామానికి దూరం అవుతుంటారు. కేవలం మందులు, ఆహారంలో జాగ్రత్తలతోనే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అనుకుంటారు. వ్యాయామం చేస్తే గుండెపై భారం పడుతుందనీ, ఇట్టే అలసిపోతామని అనుకుంటారు. కానీ, హృద్రోగులకు నడకకు మించిన వ్యాయామం లేదు. మందులు, ఆహారంతోపాటు రోజూ అరగంట నడక వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. మొదటి ఐదు నిమిషాలు చాలా నెమ్మదిగా నడవాలి. దీంతో వ్యాయామానికి శరీరం సిద్ధమవుతుంది. నిదానంగా వేగాన్ని పెంచుకుంటూ పోవాలి. మళ్లీ వేగాన్ని నెమ్మదిగా తగ్గించుకుంటూ రావాలి. అలాకాకుండా ఒకేసారి నడక వేగాన్ని తగ్గిస్తే.. తలతిరగడం లాంటి సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉంటుంది. ఎక్కువ వేగంతో తక్కువ దూరం నడవడం కన్నా.. తక్కువ వేగంతో ఎక్కువ దూరం నడిస్తే మంచి ఫలితం ఉంటుంది. కడుపు నిండా తిన్న తర్వాత వాకింగ్ చేయడం అంతమంచిది కాదు. నడక వల్ల గుండె వేగంతోపాటు శ్వాసరేటు క్రమబద్ధంగా పెరుగుతుంది. రక్తంలో ఆక్సిజన్ స్థాయులూ పెరిగి.. గుండె, ఊపిరితిత్తులు బలోపేతం అవుతాయి. రోజూ అరగంట నడవడం వల్ల రక్తపోటు తగ్గడంతోపాటు, రక్తంలో గ్లూకోజ్ అదుపులో ఉంటుంది. కొలెస్ట్రాల్ తగ్గుతుంది. కండరాల సామర్థ్యం మెరుగవుతుంది.

# బాధ్యతల్లో బందీ!





కార్పొరేట్ సంస్థల విజయాల్లో మహిళా నాయకులు కీలకపాత్ర పోషిస్తున్నారు. అదే సమయంలో.. వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో మాత్రం వెనకబడి పోతున్నారు. నాయకత్వ బాధ్యతల్లో ఉన్న మహిళలు.. ఆ విధుల్లో బందీలుగా మారుతున్నారు. అనేక మానసిక, శారీరక ఆరోగ్య సమస్యలను కొని తెచ్చుకుంటున్నారు. ఈ విషయాలను పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. సంస్థల అభివృద్ధి కోసం కృషిచేస్తున్నవారి శ్రేయస్సును కార్పొరేట్ సంస్థలు గాలికి వదిలేస్తున్నాయని విమర్శిస్తున్నాయి. కార్పొరేట్ సంస్థలను విజయతీరాలకు చేర్చాలంటే ఎన్నో అడ్డంకులను అధిగమించాలి. మరెన్నో సవాళ్లను ఎదుర్కోవాలి. ఈక్రమంలో నాయకత్వ స్థానాల్లో కీలకంగా ఉన్న మహిళలు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారట. ఈ సమస్య కంటికి కనిపించకుండా.. చాపకింది నీరులా విస్తరిస్తున్నదట. ఫలితంగా, లేడీబాస్‌లు ఎక్కువగా బర్న్ అవుట్ అవుతున్నారు. ఈ సంక్షోభం.. భవిష్యత్తులో తీవ్రమైన దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉన్నదని మానసిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం.. మహిళలు ద్విపాత్రాభినయం చేయడమేనని చెబుతున్నారు. నాయకత్వ స్థానాల్లో ఉన్న మహిళలు.. వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడంతోపాటు ఊపిరి సలపని పనులతో సతమతం అవుతుంటారు. అదే సమయంలో ఇంటి బాధ్యతలను కూడా నిర్వహిస్తుంటారు. ఇక పురుషులతో పోలిస్తే.. మహిళా నాయకులపైనే అధిక అంచనాలు ఉంటున్నాయి. ఈ కారణం కూడా వారిపై ఒత్తిడిని పెంచుతున్నదని ప్రముఖ కన్సల్టింగ్ సంస్థలు నిర్వహించిన అధ్యయనాల్లో తేల్చాయి. ఉన్నత స్థానాల్లో ఉండే పురుషుల్లో 31శాతం మంది మెంటల్లీ బర్న్ అవుట్ అవుతుండగా.. మహిళల వాటా 43 శాతం ఉన్నదని వెల్లడిస్తున్నాయి. పెద్దస్థాయిలో పని ఒత్తిడిని ఎదుర్కొంటున్న మహిళల్లో హృద్రోగాలు వచ్చే అవకాశం 50% ఎక్కువగా ఉన్నదని తేలింది. ఆందోళన, నిరాశలో కూరుకుపోయే ప్రమాదం పురుషులతో పోలిస్తే.. 1.6 రెట్లు ఎక్కువట. అధిక ఒత్తిడితో పనిచేసే మహిళల్లో నిద్రలేమి, జీవక్రియలు మందగించడం, రోగ నిరోధక వ్యవస్థ పనితీరు కూడా తగ్గే అవకాశం ఎక్కువగా ఉంటుంది. బర్న్ అవుట్స్.. రక్తపోటు, మధుమేహం ప్రమాదాన్ని పెంచుతాయని అమెరికన్ హార్ట్ అసోసియేషన్ కూడా హెచ్చరిస్తున్నది. అయితే.. మహిళా నాయకుల్లో ఈ వర్క్ ఓవర్‌లోడ్, బర్న్ అవుట్‌ను పరిష్కరించడం కేవలం వ్యక్తిగత బాధ్యత కాదనీ, నేరుగా ఎదుర్కోవాల్సిన సంస్థాగత సవాలు అని అంటున్నారు మానసిక నిపుణులు. కార్పొరేట్ కంపెనీలు తమ మహిళా నాయకులఆరోగ్యం, శ్రేయస్సును కాపాడటానికి విశ్వసనీయ వ్యూహాలను అభివృద్ధి చేయాలని సూచిస్తున్నారు. సౌకర్యవంతమైన పని వసతులు, మానసిక ఆరోగ్య వనరులు, నిర్మాణాత్మక మార్గదర్శక కార్యక్రమాలు నిర్వహించాలని చెబుతున్నారు. చివరగా.. వ్యాపారంలో విజయం సాధించాలంటే.. దానికి నాయకత్వం వహించేవారి ఆరో గ్యంపైనా శ్రద్ధ చూపాలి. అందులోనూ మహిళలపై మరింత ఎక్కువ ఫోకస్ పెట్టాలి. మానసిక శ్రేయస్సుకు ప్రాధాన్యతనిచ్చే సంస్థలు.. అగ్రశ్రేణి ప్రతిభను నిలుపుకోవడంతోపాటు మరింత స్థిరమైన అభివృద్ధిని సాధిస్తాయని నిపుణులు చెప్పుకొస్తున్నారు.





# ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా..?


## అయితే ప్రోటీన్ల లోపం ఉందేమో చెక్ చేసుకోండి..!

మన శరీరానికి స్థూల పోషకాలు, సూక్ష్మ పోషకాలు రెండూ అవసరం అన్న విషయం విదితమే. ఈ క్రమంలోనే ప్రోటీన్లు స్థూల పోషకాల కిందకు వస్తాయి. అంటే ప్రోటీన్లను మనం నిత్యం ఎక్కువ మొత్తంలో తీసుకోవాలన్నమాట. ప్రోటీన్లు మన శరరీంలో అనేక విధులను నిర్వహిస్తాయి. ప్రోటీన్ల వల్ల జీవక్రియలు సరిగ్గా నిర్వహించబడతాయి. అలాగే కండరాలు అభివృద్ధి చెందుతాయి. రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. అయితే కొందరు నిత్యం కార్బొహైడ్రేట్లు లేదా కొవ్వులను అధికంగా తింటుంటారు. ప్రోటీన్లను సరిగ్గా తీసుకోరు. దీంతో ప్రోటీన్ల లోపం ఏర్పడుతుంది. ఇది వస్తే ప్రమాదంలో పడినట్లే అని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. కనుక ప్రోటీన్ల లోపం ఏర్పడకుండా చూసుకోవాలి. అయితే మన శరీరానికి ప్రోటీన్లు సరిగ్గా లభించకపోతే అప్పుడు మన శరీరం కొన్ని సంకేతాలను తెలియజేస్తుంది. అవేమిటంటే..

**జుట్టు ఆరోగ్యం..:** ప్రోటీన్లను సరిగ్గా తీసుకోకపోతే మన శరీరంలోని కండరాలకు శక్తి సరిగ్గా లభించదు. దీంతో కండరాలు బలహీనంగా మారి నొప్పి వస్తాయి. రోజూ మీరు చేసే చిన్న చిన్న పనులను కూడా చేయలేకపోతుంటారు. కండరాలను టచ్ చేస్తే చాలు తీవ్రమైన నొప్పి ఉంటుంది. ఈ లక్షణాలు కనిపిస్తుంటే ప్రోటీన్ల లోపం వచ్చిందని అర్థం చేసుకోవాలి. అలాగే ప్రోటీన్ల లోపం జుట్టు ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపిస్తుంది. ప్రోటీన్ల లోపం ఉంటే జుట్టుకు పోషణ లభించదు. దీంతో జుట్టు పలుచగా మారుతుంది. బలహీనమవుతుంది. జుట్టు నిర్జీవంగా కనిపిస్తుంది. జుట్టు కుదుళు కూడా బలహీనంగా మారి జుట్టు రాలుతుంది. ఈ లక్షణాలు కనిపిస్తున్నా కూడా ప్రోటీన్ల లోపం ఉందని అర్థం చేసుకోవాలి.

**రోగ నిరోధక వ్యవస్థ..:** మన శరీర రోగ నిరోధక వ్యవస్థ సాఫీగా పనిచేయాలంటే అందుకు ప్రోటీన్లు అవసరం అవుతాయి. అయితే ప్రోటీన్ల లోపం ఉంటే దాని ప్రభావం రోగ నిరోధక వ్యవస్థపై కూడా పడుతుంది. దీంతో ఇమ్యూనిటీ తగ్గిపోతుంది. ఫలితంగా తరచూ దగ్గు, జలుబు, ఫ్లూ బారిన పడుతుంటారు. లేదా ఈ వ్యాధులు వస్తే ఒక పట్టాన తగ్గవు. నెలల తరబడి అలాగే ఉంటాయి. ఈ లక్షణాలు కూడా ప్రోటీన్ లోపాన్ని తెలియజేస్తాయి. అలాగే ప్రోటీన్ల లోపం ఉంటే శరీరానికి శక్తి సరిగ్గా లభించక తీవ్రమైన అలసట, నీరసం ఉంటాయి. చిన్న పని చేసినా కూడా విపరీతంగా అలసిపోతారు. మెట్లు ఎక్కలేకపోతుంటారు. ఆయాసం వస్తుంది. శరీరంలో శక్తి స్థాయిలు తగ్గినట్లు అనిపిస్తుంది. బలహీనంగా మారిపోతారు. ఇవన్నీ ప్రోటీన్ల లోపం ఉందని చెప్పే లక్షణాలే. **నొప్పులు, వాపులు..:** ప్రోటీన్ల లోపం ఉంటే ఉన్నట్లుండి సడెన్ గా బరువు పెరగడమో లేదా తగ్గడమో జరుగుతుంది. అధిక బరువు ఉన్నవారు బరువును తగ్గించుకోలేకపోతుంటారు. అలాగే పాదాలు, అర చేతులతోపాటు శరీరంలోని ఇతర భాగాల్లోనూ వాపులు కనిపిస్తాయి. ఆ ప్రాంతంలో నొక్కితే సొట్టపడి చర్మం లోపలికి పోతుంది. ఆయా భాగాల్లో విపరీతమైన నొప్పి ఉంటుంది. నొప్పిని భరించలేకపోతుంటారు. ప్రోటీన్ల లోపం కారణంగా శరీరంలో ద్రవాల అసమతుల్యత ఏర్పడి అలా జరుగుతుంది. కనుక ఈ లక్షణాలను కూడా ప్రోటీన్ల లోపంగానే భావించాలి. ప్రోటీన్ల లోపం ఉంటే గోర్లకు సరిగ్గా పోషకాలు లభించవు. దీంతో గోర్లు బలహీనం గా మారి విరిగిపోతుంటాయి. గోర్లు పలుచగా మారిపోతాయి. అలాగే కొందరి గోర్లు రంగు కూడా మారుతాయి. ఇలా పలు లక్షణాలను బట్టి ప్రోటీన్ల లోపం వచ్చిందని అర్థం చేసుకోవచ్చు. డాక్టర్ వద్దకు వెళితే సరైన చికిత్స అందిస్తారు. ప్రోటీన్ల లోపం పోవాలంటే ప్రోటీన్లు ఉండే ఆహారాలను రోజూ తినాల్సి ఉంటుంది.

# పుచ్చకాయల్లో కల్తీ.. ఎలా గుర్తించాలంటే..?



ఉష్ణోగ్రత వల్ల వాతావరణంలో మార్పులు వస్తుంటాయి. ఎండ తీవ్రత పెరిగే కొద్దీ శరీరం చల్లదనాన్ని కోరుకుం టుంది. చల్లగా ఉండే ప్రదేశంలో ఉండాలని,చల్లగా ఉండే పదర్థాలనే తినాలి అనిపిస్తుంది. అందులో ముఖ్యమైనది పుచ్చకాయ.

వేసవి వచ్చిందంటే పుచ్చకాయ వంటి పండ్లకు డిమాండ్ పెరుగుతుంది. ఈ డిమాండ్ వల్ల కల్తీ చేసే ప్రమాదం కూడా పెరుగుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని,ఆహార భద్రత విభాగం ప్రజలను పుచ్చకాయలు కొనేటప్పుడు జాగ్రత్త వహించాలని సూచనలు జారీ చేసింది.కృత్రిమ రంగులతో కలిపిన కుళ్ళిపోయిన పుచ్చకాయల విక్రయాన్ని అరికట్టేందుకు భాగంగా, ఇటీవల తిరుప్పూర్‌లోని విక్రయ కేంద్రాల్లో అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో అధికారులు 1,100 కిలోల లోపాలున్న పుచ్చకాయలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే, నాణ్యత లేని 60 కిలోల పుచ్చకాయలను అధికారుల బృందం స్వాధీనం చేసినట్లు కూడా తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని,ఈ సీజన్‌లో సరైన పుచ్చకాయలను కొనడానికి 10 చిట్కాలను ఇక్కడ పేర్కొన్నారు. పుచ్చకాయ ఎలా ఉంది అని తనిఖీ చేయడానికి ఒక సులభమైన మార్గం దాని ఆకారాన్ని చూడటం. ఎల్లప్పుడూ ఒకే ఆకారంలో సమానమైన రూపంలో ఉన్న దాన్ని ఎంచుకోండి. ఆకారం లేదా పరిమాణంలో అసమానతలు అసమాన పక్వత లేదా సరైన పెరుగుదల పరిస్థితులు లేకపోవడాన్ని సూచిస్తాయి. ఇది పండు రుచి ఆకృతిని ప్రభావితం చేయవచ్చు. పుచ్చకాయ బయట తొక్కను పరిశీలించి, దానికి శక్తివంతమైన రంగులు మృదువైన, గట్టి ఆకృతి ఉన్నాయో లేదో చూడాలని కూడా సూచించబడింది. పండిన పుచ్చకాయ సాధారణంగా లోతైన ఆకుపచ్చ రంగులో ముదు రు గీతలు లేదా మచ్చలతో ఉంటుంది. లేత రంగులో ఉన్న మెత్తని మచ్చలు ఉన్న పుచ్చకాయలను నివారించండి, ఎందుకంటే ఇవి చెడిపోవడాన్ని సూచించవచ్చు. భారత ఆహార భద్రత, ప్రమాణాల అధికార సంస్థ ప్రకారం, పుచ్చకా యను రెండు భాగాలుగా కోసి, పత్తిని తీసుకుని కొంత సమయం పుచ్చకాయపై రుద్దాలి. పుచ్చకాయ ఎరుపు రంగు నిజమైనదైతే, పత్తి బంతి ఎర్రగా మారదు. ఇది పుచ్చ కాయ నిజమైనదని, దాని రంగుతో ఎటువంటి జోక్యం జరగలేదని చూపిస్తుంది. అలాగే, కొంతమంది విక్రేతలు పుచ్చకాయను ఎర్రగా కనిపించేలా ఇంజెక్షన్ చేస్తారు. కాబట్టి పత్తితో రుద్దినప్పుడు దాని రంగు ఎర్రగా మారుతుంది. పత్తి ఎర్రగా మారడం అంటే పుచ్చకాయలో ఇంజెక్షన్లు లేదా రసాయనాలు ఉపయోగించబడ్డాయని సూచిస్తుంది. ఇది మన ఆరోగ్యానికి మంచిది కాదు. కాబట్టి అలాంటి పుచ్చకాయలను తీసుకోవడం మానుకోండి. పండిన పుచ్చకాయ దాని పరిమాణానికి బరువుగా అనిపించాలి. ఎందుకంటే ఇది అధిక నీటి సాంద్రత, రసవంతమైనదని సూచిస్తుంది. పుచ్చకాయను ఎత్తి,దాని బరువును ఇతర సమాన పరిమాణంలో ఉన్న కాయలతో పోల్చండి. బరువైన పుచ్చకాయలు సాధారణంగా ఎక్కువ రసవంతంగా మరియు రుచికరంగా ఉంటాయి. పుచ్చకాయ ఉపరితలంపై చిన్న గోధుమ రంగు మచ్చలు లేదా గీతలు కనిపిస్తాయి. ఈ మచ్చలు పండులో అధిక చక్కెర సాంద్రత ఉందని అది తీపిగా రుచికరంగా ఉంటుందని సూచిస్తాయి. ఉత్తమ రుచి అనుభవం కోసం గుర్తించదగిన షుగర్ స్పాట్స్ ఉన్న పుచ్చకాయలను చూడండి.నిపుణుల ప్రకారం, పుచ్చకాయ దిగువ భాగాన్ని, అంటే అది పెరుగుతున్నప్పుడు నేలపై ఉంచి బెల్లీ ని కూడా పరిశీలించాలి. పూర్తిగా పండిన పుచ్చకాయకు క్రీమీ లేదా బంగారు-పసుపు రంగు ఫీల్డ్ స్పాట్ ఉంటుంది. ఇది అది తీగపై పూర్తిగా పండినట్లు సూచిస్తుంది. పుచ్చకాయ ముక్కపై తెల్ల కాగితం లేదా టిష్యూ పేపర్‌ను రుద్ది, రంగులు కాగితానికి అంటుకోకపోతే రసాయనాలు లేవని నిర్ధారించుకోండి. కొన్నిసార్లు పుచ్చకాయలను గోడౌన్‌లలో నేలపై బహిరంగంగా నిల్వ చేస్తారు. ఇక్కడ ఎలుకలు వాటిని కొరుకుతాయి. బాహ్య గుర్తులపై దృష్టి పెట్టి, సంక్రమణ ప్రమాదాన్ని నివారించడానికి జాగ్రత్త వహించాలని సూచిస్తున్నారు.

# వేప విరుగుడు...

సాయంత్రానికి శరీరమంతా తడిసి ముద్దవుతుంది. కాటన్ బట్టలు వేసుకున్నా.. కంపు వాసన కొడతాయి. ఫలితంగా దురద, దానివెంటే దద్దుర్లు ఇబ్బంది పెడతాయి. ఇక ఏవైనా చర్మ సమస్యలు ఉంటే.. అవి మరింతగా విజృంభిస్తాయి. వీటినుంచి ఉపశమనం పొందడానికి వేలకు వేలు పోసి.. రకరకాల క్రీములు కొనాల్సిన పనిలేదు. అవి వాడినా.. సమస్య పూర్తిగా పరిష్కారం కాదు. సహజ సిద్ధంగా, వీధుల్లో దొరికే 'వేపాకు'తోనే వీటికి చెక్ పెట్టొచ్చు. వేసవి సమస్యలను నివారించవచ్చు. మార్కెట్లో దొరికే ఖరీదైన క్రీములు, లోషన్లు అందరికీ ఉపశమనం కలిగించలేవు. సహజసిద్ధమైన దివ్యౌషధంగా పేరున్న వేపాకులు.. వేసవిలో వచ్చే అనేక సమస్యలకు పరిష్కారం చూపుతాయి. రూపాయి ఖర్చులేకుండా.. పూర్తిగా నిర్మూలిస్తాయి. **వేపనీటితో స్నానం..:** ఒక కుండలో రెండు లీటర్ల నీటిని తీసుకొని, అందులో 15 నుంచి 20 తాజా వేపాకులు వేయాలి. ఈ నీటిని 10 నుంచి 15 నిమిషాలపాటు మరిగించాలి. నీరు వెచ్చగా ఉన్నప్పుడే.. స్నానపు నీటిలో కలపాలి. ఆ నీటితో స్నానం చేయడం వల్ల.. అనేక ప్రయోజనాలు కలుగుతాయి. వేపాకులకు బ్యాక్టీరియా, ఫంగల్ ఇన్ఫెక్షన్లను నాశనంచేసే సామర్థ్యం ఉంటుంది. వేపాకులు యాంటి బ్యాక్టీరియల్, యాంటి ఫంగల్, యాంటి ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటాయి. ఇవి దురద నుంచి ఉపశమనాన్ని కలిగించడంతోపాటు ఇన్ఫెక్షన్ల నుంచి చర్మాన్ని రక్షిస్తాయి. ప్రతిరోజూ వేపనీటితో స్నానం చేయడం వల్ల చెమట కారణంగా శరీరం నుంచి వచ్చే దుర్వాసన తగ్గుతుంది. దురదతోపాటు దద్దుర్ల బాధ తప్పుతుంది. శరీరంలో ఉత్పత్తి అయ్యే బ్యాక్టీరియా నశించిపోతుంది. చర్మం మృదువుగా, ఆరోగ్యంగా మారుతుంది. **వేపతో పసుపు..:** చర్మ సమస్యలు కూడా ఉన్నట్టయితే.. వేసవిలో మరింత ఇబ్బంది పడాల్సి వస్తుంది. అలాంటివారు వేపాకులకు పసుపును కలిపితే మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. 8 నుంచి 10 వేపాకులను మెత్తగా గ్రైండ్ చేసి.. అందులో అర టీస్పూన్ పసుపు కలపండి. ఈ పేస్ట్‌ను దురద ఎక్కువగా ఉన్న ప్రాంతంలో అప్లయి చేయాలి. 20 నిమిషాలపాటు అలాగే ఆరనిచ్చి.. గోరువెచ్చని నీటితో కడిగేయాలి. పసుపులో యాంటి సెప్టిక్ లక్షణాలు ఉంటాయి. ఇవి వేపతో కలిసి.. చర్మపు చికాకును తగ్గిస్తాయి. దురద నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. ముఖ్యంగా తామర, సోరియాసిస్ లాంటి ఫంగల్ ఇన్ఫెక్షన్లతో బాధపడేవారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.



## అయోమయంలో వైసీపీ..
# చిక్కుల్లో జగన్!

గుంటూరు,: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అత్యంత సున్నితమైన, కీలక మైన అమరావతి విషయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరోసారి వ్యూహాత్మక తప్పిదం చేసిందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. 2019-24 మధ్య మూడు రాజధానుల పేరుతో కాలయాపన చేసి, ఎన్నికల్లో భారీ మూల్యం చెల్లించుకున్న తర్వాత కూడా ఆ పార్టీ తన పంథాను మార్చుకోకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. తాజాగా లోక్‌సభలో అమరావతికి చట్టబద్ధత కల్పించే ఏపీపునర్వ్యిభ జన సవరణ బిల్లు-2026 ఆమోదం పొందిన వేళ.. జగన్ మోహన్ రెడ్డి తెరపైకి తెచ్చిన మావిగన్ అనే కొత్త ప్రతిపాదన ఆ పార్టీని మరింత రాజకీయ రక్షణలో పడేసింది. మచిలీపట్నం, విజయవాడ, గుంటూరులను కలిపి మావిగన్ అనే గ్రోత్ కారిడార్‌ను రాజధానిగా జగన్ ప్రతిపాదించడం ఇప్పుడు పెద్ద చర్చకు దారితీసింది. అయితే, పార్లమెంట్ సాక్షిగా అమరావతికి శాసనపరమైన గుర్తింపు దక్కిన ఈ తరుణంలో ఇలాంటి ప్రతిపాదనలు చేయడం చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం లాంటిదేనని విశ్లేషకులు అభిప్రాయపడుతు న్నారు. అమరావతి ఇప్పుడు కేవలం ఒక రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మాత్రమే కాదు, అది పార్లమెంట్ ఆమోదించిన చట్టం. జగన్ భవిష్యత్తులో అధికారంలోకి వచ్చినా తన వ్యక్తిగత కార్యాలయాలను ఎక్కడైనా పెట్టుకోవచ్చు కానీ, రాజధానిని తరలించడం అనేది ఇప్పుడు అసాధ్యమైన ప్రక్రియగా మారింది.రాజధాని విషయంలో వైసీపీ అనుసరిస్తున్న దోబూచులాట ఆ పార్టీ క్యాడర్‌ను కూడా గందరగోళానికి గురిచేస్తోంది. ఒకవైపు అమరావతికి తాము వ్యతిరేకం కాదని చెబుతూనే, మరోవైపు పార్లమెంట్‌లో బిల్లును వ్యతిరేకించి వాకౌట్ చేయడం ద్వారా తమ ద్వంద్వ వైఖరిని బయటపెట్టుకున్నారు. ఈ సమయంలో అమరావతికి సంపూర్ణ మద్దతు ప్రకటించి, కేవలం అక్కడ జరుగుతున్నట్లుగా తాము భావిస్తున్న అవినీతి పై మాత్రమే పోరాటం చేసి ఉంటే వైసీపీకి రాజకీయంగా మైలేజీ దక్కేది. కానీ, ఇప్పుడు మావిగన్ వంటి కొత్త పేర్లతో గందరగోళం సృష్టించడం వల్ల ప్రజల్లో ఆ పార్టీ విశ్వస నీయత మరింత దెబ్బతినే ప్రమాదం ఉంది.అమరావతిని స్మశానం అని, గ్రాఫిక్స్ అని ఎద్దేవా చేసిన నేతలే, ఇప్పుడు రాజధాని హోదా కల్పించడాన్ని తప్పుపడుతున్నారు. సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు వంటి వారు అన్నీ అమరావతికే చేస్తే మేము అడుక్కుతినాలా? అని చేస్తున్న వ్యాఖ్యలు ప్రాంతీయ విద్వేషాలను రేకెత్తించేలా ఉన్నాయి. ఇలాంటి వ్యాఖ్యలను కట్టడి చేయకుండా, జగన్ కూడా అదే బాటలో ప్రయాణించడం ఆయన రాజకీయ భవిష్యత్తుకే ముప్పు తెచ్చేలా ఉంది. అభివృద్ధిని అడ్డుకుంటున్నారనే ముద్ర ఇప్పటికే పడటంతో,మావిగన్ ప్రతిపాదన ఆ ముద్రను మరింత బలపరు స్తోంది. రాజకీయాల్లో టైమింగ్ చాలా ముఖ్యం. కేంద్రం అమరావ తికి నిధులు ఇవ్వడమే కాకుండా చట్టబద్ధత కూడా కల్పిస్తున్నప్పుడు, దానికి క్రెడిట్ రాకుండా చూడటం లేదా ఆ క్రెడిట్‌లో భాగస్వామ్యం కావడం విజ్ఞత అనిపించుకుంటుంది. కానీ వైసీపీ వ్యూహకర్తలు జగన్ చేత చట్టాన్ని సవరించలేరా అనే వ్యాఖ్యలు చేయించడం ద్వారా తాము అభివృద్ధి నిరోధకులమనే సంకేతాలు పంపారు. పోతరాజు తనను తాను కొట్టుకున్నట్లుగా, కేవలంపంతం కోసమే రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా నిలబడుతున్నామనే అభిప్రాయం ప్రజల్లో కలిగేలా ఈమావిగన్ రాజకీయం సాగుతోందన్న విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయి.

# ఐటీలో ఊచకోత

ఢిల్లీ,: ప్రపంచ టెక్నాలజీ రంగంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) భారీ కుదుపులు తెస్తున్నది. నిన్నటివరకు ఆకర్షణీయంగా నిలిచిన ఐటీ జాబ్ నిర్వచనం మారిపోతున్నది. కంపెనీల ఉద్యోగాల ఊచకోత టెకీలకు కునుకు లేకుండా చేస్తున్నది. ఏఐ ఆధారిత వ్యవస్థల కోసం కంపెనీలు చేపట్టిన పునర్వ్యవస్థీకరణలో ఉద్యోగాలు హుష్‌కాకి అవుతుండటమే ఇందుకు కారణం. ఆరకిల్ నుంచి అమెజాన్ వరకు దిగ్గజ కంపెనీలు సైతం ఉద్యోగాలను ఊడగొడుతున్నాయి. ఈ కోతలు ఇండియాకూ పాకాయి. ఆరకిల్ ఇండియా మొన్న ఒకేరోజు 2,500 మందికి ఉద్వాసన పలికింది. 'ఈ రోజు మీకు చివరి పనిరోజు' అనే సందేశాలు అందుకున్న టెకీలు అవాక్కయ్యారు. భారత్‌లో ఆరకిల్ మొత్తం సిబ్బంది 30 వేల మంది. అందులో ఇప్పటివరకు 12 వేలమం దికి పైగా పింక్ స్లిప్పులు అందుకున్నారు. దీనిని బట్టి తొలగింపులు ఏ స్థాయిలో ఉన్నాయో అంచనా వేయవచ్చు. మరికొన్ని వారాల్లో మరిన్ని తొలగింపులు ఉంటాయని వినిపిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా 30 వేల పైచిలుకు ఉద్యోగులను ఆరకిల్ తొలగిస్తున్నది. భారతదే శంలో అతిపెద్ద ఐటీ కంపెనీ అయిన టీసీఎస్ తన ఆరు లక్షల మంది సిబ్బందిలో 2 శాతం, అంటే 12 వేల మందిని తొలగించింది. మైక్రోసాఫ్ట్, ఇంటెల్, బ్లాక్, మెటా,యాపిల్.. ఇలా పేరున్న కంపెనీ లన్నీ భారం తగ్గించుకొనే పనిలో పడ్డాయి. ఏఐతో మానవాళికి ముప్పు పలువురు హెచ్చరించారు. ఇప్పుడు టెకీల మెడకు ఏఐ ఉచ్చు బిగిస్తు న్నది. సుమారు రెండు దశాబ్దాల ఐటీ పొంగు క్రమంగా చల్లారుతు న్నది. 2005-2020 మధ్యకాలంలో దూకుడు చూపిన ఐటీ కంపెనీలు రిక్రూట్‌మెంట్‌కు బ్రేకులు వేస్తున్నాయి. వార్షిక ఆదా యాలు, ఉద్యోగాల పెరుగుదల 15 శాతం నుంచి కొవిడ్ అనంతరకా లంలో 5-6 శాతానికి పడిపోయింది. ఇప్పుడు ఏఐ దెబ్బకు కోతలు తారస్థాయికి చేరుకున్నాయి. సంస్థ వ్యాపార అవసరాల రీత్యా అనేక జాబ్స్ నిరర్థకంగా మారుతున్నాయని కంపెనీలు అంటున్నాయి. గత ఏడాది సుమారు 1,12,732 మంది టెకీలు రోడ్డున పడ్డారు. ఈ ఏడాది



ఈ సంఖ్య చాలా ఎక్కువగా ఉండే అవకాశాలు స్పష్టంగానే కనిపిస్తున్నాయి. 2031 నాటికి ఆటోమేషన్ కుదుపు 20 శాతం వరకు ఉండొచ్చని ఐటీపై నీతిఆయోగ్ విడుదల చేసిన నివేదికలో అంచనా వేసింది. ఏఐ దూసుకొస్తున్న నేపథ్యం ఓ వైపు, ఆర్థిక అస్థి రతలు మరోవైపు అడకత్తెరలా బిగుస్తుండటమే ఇందుకు కారణమని చెప్పాలి. ఉద్యోగాల కోత అనేది నాణేనికి ఒకవైపు మాత్రమే.ఎందు కంటే ఐటీ పరిశ్రమ ఓ పెద్ద మలుపులో నిల్చున్నది. ఏఐ ప్రభావంతో సాధారణ కోడింగ్ ఉద్యోగాలు కొండెక్కుతున్నాయి.సాంప్రదాయిక పని పద్ధతులకు కాలం చెల్లిపోయి ఒకరకం ఉద్యోగాలకు డిమాండ్ తగ్గుతున్నప్పటికీ, మరోరకం ఉద్యోగాల అవసరం క్రమంగా పెరుగు తుండటం ఆశాజనకంగా ఉన్నది. ఏఐని నియంత్రించేది అంతిమం గా మనుషులేనన్నది నిర్వివాదాంశం. జాబ్ మార్కెట్‌ను ఏఐ కొత్తపుంతలు తొక్కిస్తున్నది. గత రెండేండ్ల కాలంలోనే 13 లక్షల ఉద్యోగాలను ఏఐ సమకూర్చింది. సరికొత్త టెక్ యుగానికి ఏఐ, డాటా, డిజిటల్ ఇంజినీరింగ్ ప్రావీణ్యాలు ముఖ్యావసరాలుగా ఎదిగివస్తున్నా యి. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త ప్రావీణ్యాలు సంతరించుకోవడం ఒక్కటే పరిష్కారమని టెకీలూ గుర్తించాలి.

# రాజ్యాంగేతర శక్తిగా ఐఏఎస్..

హైదరాబాద్, : సాధారణంగా మనం రాజకీయ నాయకులను అత్యంత శక్తివంతులైన వారిగా భావిస్తుంటాం.. వారు తలచుకుంటే ఏదైనా చేయగలరని అనుకుంటాం. కానీ రాజకీయ నాయకులను మించిపోతున్నారు నేటి కాలంలో అధికారులు. ముఖ్యంగా కొంతమంది బ్యూరో క్రాట్ లు సమాంతర వ్యవస్థను నడిపిస్తున్నారు. గతంలో ఇలా ఉండేది కాదు. ఇప్పుడు రాజకీయ నాయకులకు సంపాదన మీద విపరీతమైన యావ పుట్టింది కాబట్టి.. అక్రమ అర్జనకు అధికారుల అండ కావాలి కాబట్టి.. అటువంటి అధికారులు తమకు తాముగా స్వీయ శక్తిని పెంచుకొని వ్యవస్థలకు మించి ఎదుగుతున్నారు.తెలంగాణ రాష్ట్రంలో ఓ మంత్రి కుటుంబ సభ్యులు హైదరాబాద్ నగర శివారులో ఓ గ్రామంలో భూముల కబ్జాలకు పాల్పడ్డారని ఆరోపణలు వచ్చాయి. ఆ భూములను ఇవ్వకపోతే వారిని అంతం చేస్తారని బెదిరించినట్టు వార్తలు వినిపించాయి. వారికి ప్రతిపక్ష పార్టీ అండగా నిలిచింది. వారు ఇచ్చిన ఆధారాలను విలేకరుల ఎదుట ప్రదర్శించింది. ఆ మంత్రి కుమారుడు.. బంధువులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.. ఈ నేపథ్యంలో ఆ విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రతిపక్ష నాయకుడు ఓ ఐఏఎస్ అధికారి గురించి ప్రధానంగా ప్రస్తావించారు. ఆ అధికారి మంత్రి కుటుంబ సభ్యులతో మిలాఖత్ అయ్యారని.. ఆయన అండదండలతోనే మంత్రి కుటుంబ సభ్యులు రెచ్చిపోతున్నారని ఆ ప్రతిపక్ష నాయకుడు ఆరోపించారు.. ఆ అధికారిపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఆ అధికారి పేరును పదేపదే ప్రస్తావించిన నేపథ్యంలో.. ఆయన గురించి విస్తృతంగా చర్చ జరుగుతుంది. ఇప్పటి అధికార పార్టీలోనే కాదు.. గత అధికార పార్టీలోనూ ఆ సీనియర్ ఐఏఎస్ అధికారి ముఖ్య భూమిక పోషించారు. నాడు ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థలో తీసుకొచ్చిన విప్లవాత్మకమైన మార్పులో ఆ ఐఏఎస్ అధికారి తనకు అనుకూలంగా నిబంధనలు మార్చారు. భూములను మొత్తం నచ్చిన వాళ్లకు కట్టబెట్టారు. ఏళ్ల తరబడి ఆయన అదే పోస్టులో ఉన్నారు.. ఒక సమాంతర వ్యవస్థను ఏర్పాటు చేసుకొని.. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడం మాత్రమే కాదు.. సొంత ఆస్తులను విపరీతంగా పెంచుకున్నారు.. అప్పట్లో ఓ రాజకీయ పార్టీకి ఆ అధికారి భారీగా విరాళం కూడా ఇచ్చినట్టు వార్తలు వచ్చాయి.నాడు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆ అధికారి రెవెన్యూ విభాగంలో కింగ్ పిన్ మాదిరిగా వ్యవహరించాడు. ఇప్పుడు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా ఆయన అదే శాఖలో కొనసాగుతున్నాడు. అంతేకాదు అంతకుమించి అనే స్థాయిలో దోపిడికి పాల్పడుతున్నాడు. సదరు అధికారి గురించి ఇటీవల ప్రతిపక్ష పార్టీకి సంబంధించిన కీలక నాయకుడు చేసిన ఆరోపణలు నూటికి నూరు శాతం నిజం. కాకపోతే, ఆ ప్రతిపక్ష నాయకుడు తెలంగాణ ప్రభుత్వంలో షాడో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా..ఆ అధికారి ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. నాడు ఆ అధికారితో సదరు కీలక ప్రతిపక్ష నాయకుడు చెట్టా పట్టాలు వేసుకొని తిరిగాడు. దీనినిబట్టి అధికారం ఉన్నప్పుడు ఒక విధంగా.. అధికారం లేనప్పుడు మరొక విధంగా మాట్లాడటం రాజకీయ నాయకులకు పరిపాటిగా మారిందనే సందర్భాన్ని మనం ఇక్కడ గుర్తు చేసుకోవాలి.

# మూడు కార్పొరేషన్ల పాలన ప్రారంభం

హైదరాబాద్, : హైదరాబాద్ మహానగర పరిధిలో వికేంద్రీకృత నగర పాలనను బలోపేతం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయూఆర్) పరిధిని మూడు మున్సిపల్ కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తూ ఫిబ్రవరి 11వ తేదీన ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి మార్చి 31 వరకు ఉద్యోగుల వేతనాలు, ఇతర ఖర్చులు, బిల్లుల చెల్లింపు వంటి అంశాలను జీహెచ్ఎంసీ ద్వారానే నిర్వహించారు. అయితే 2026-27 కొత్త ఆర్థిక సంవత్సరం నేటి ప్రారంభం కావడంతో ఎవరికివారే పరిపాలన ప్రారంభించనున్నారు. ఆదాయం, ఖర్చులను సైతం ఎక్కడికక్కడే నిర్వహించనున్నారు.తెలం గాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయూఆర్) పరిధిలోని 2,053 చదరపు కిలోమీటర్ల పరిధిని ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ), సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ), మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ)లను ఏర్పాటు చేసింది. మూడు కార్పొరేషన్ల విభజనలో భాగంగా 689 చదరపు కిలోమీటర్లతో 150 వార్డులతో కూడిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహె చ్ఎంసీ)ని ఏర్పాటు చేశారు. 70 లక్షల జనాభా ఉందని అధికారులు చెబుతున్నారు.ఖైరతాబాద్, సికింద్రాబాద్, చార్మినార్, రాజేంద్రనగర్, గోల్కొండ, శంషాబాద్ జోన్లు ఉన్నాయి. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జోన్లలోని 16 సర్కిళ్లు, 76 వార్డులతో కూడిన సైబరా బాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ)గా ఏర్పాటు చేశారు. ఈ కార్పొరేషన్ 613 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉంది. 31.11లక్షల జనాభాఉంది.


మల్కాజ్‌గిరి, ఉప్పల్,ఎల్బీనగర్ జోన్లలోని 14 సర్కిళ్లు, 74 వార్డులతో మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ)గా ఏర్పాటు చేశారు. 654 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 32.52 లక్షల జనాభా ఉందని అధికారులు గుర్తించారు.జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ పరిధిలో సుమారు 25లక్షల ప్రాపర్టీ ట్యాక్స్ అసెస్ మెంట్లు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

వీటిలో సుమారు 20 లక్షల మంది మాత్రమే రెగ్యులర్‌గా ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లిస్తున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 31మార్చి రాత్రి 9 గంటల వరకు రూ.2,501 కోట్ల ఆస్తి పన్ను వసూలైనట్లు అధికారులు తెలిపారు. మరో రూ.50 కోట్లు వచ్చే అవకాశముందని అధికారుల అంచనా వేస్తున్నారు. మొత్తం రూ.2,550 కోట్లకు పైగా ప్రాపర్టీ ట్యాక్స్ వసూలయ్యే అవకాశం ఉందని అధికారులు లెక్కలు వేసుకుంటు న్నారు. బుధవారం నుంచి వసూలయ్యే ఎర్లీబర్డ్ స్కీమ్ ట్యాక్స్ వేర్వేరుగా వసూలు చేయనున్నారు.

ప్రాపర్టీ ట్యాక్స్ సంబంధించి 2026-27 సంవత్సరానికి ముందస్తుగా చెల్లించి ఎర్లీబర్డ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, సీఎంసీ కమిషనర్ సృజన, ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి కోరారు. ఏప్రిల్ నెలలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026?27)కి సంబంధించిన మొత్తం ప్రాపర్టీ టాక్స్‌ను ముందుగానే చెల్లించే వారికి 5 శాతం రాయితీ లభించనుందన్నారు. గత సంవత్సరాల బకాయిలపై ఈ రాయితీ వర్తించదన్నారు.

# ఒరాకిల్ లో ఏం జరుగుతోంది?

హైదరాబాద్, : టెక్ దిగ్గజం ఒరాకిల్ ఒకేసారి 30 వేల మంది ఉద్యోగులపై వేటు వేయడం తీవ్ర కలకలం రేపింది. ఈ ఊచకోత రాబోయే రోజుల్లోనూ కొనసాగనున్నాయని సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ పరిణామం ఇప్పుడు భారతదేశంలోని టెక్ హబ్‌లలో కొత్త భయాందోళనలు రేకెత్తిస్తోంది. కంపెనీలు అనుసరిస్తున్న లేఆఫ్ ల కారణంగా ఐటీ నిపుణులు తమ భారీ పెట్టుబడులను పున:సమీక్షించుకుంటున్నారని తద్వారా రియల్ ఎస్టేట్ రంగంపై తీవ్ర ప్రభావం పడబోతున్నట్లు బిజినెస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.రెండు దశాబ్దాలుగా భారత్‌లో నెక్ట్స్ లెవల్ గా దూసుకుపోయిన భారత ఐటీ సెక్టార్ వృద్ధి వేగంగా ఇటీవల నెలకొన్న పరిణామలతో తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. ఒరాకిల్ ఇండియా తరహా పరిణామాలు ఇతర కంపెనీల్లోనూ కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇదే జరిగితే దేశంలోని ఐటీ నగరాలపై తీవ్ర ప్రభావం పడబోతున్నట్లు తెలుస్తోంది. ఐటీ రంగంలో వచ్చిన ఆదాయం ప్రధానంగా బెంగళూరు, హైదరాబాద్ , పూణే, ఎన్ సీఆర్ నగరాల్లో రియల్ ఎస్టేట్ రంగం బలపడటాని వెన్నెముకగా నిలిచింది. కానీ తాజా లే ఆఫ్ లతో ఈ పరిస్థితులు తారుమారు అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. గతంలో భారీ ధరలు పెట్టి ఫ్లాట్లు కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు.. ఇప్పుడు తమ ఈఎంఐలను చెల్లించేందుకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ఇక ఉద్యోగాల్లో కొనసాగుతున్న వారు రేపు తమకు కూడా ఇదే పరిస్థితి రావొచ్చనే భయంతో తమ నిర్ణయాలను వాయిదా వేసుకునే అవకాశాలు ఉండనుంది.ఐటీ రంగంలో వస్తున్న పెనుమార్పులు ఇప్పుడు సామాన్యుడి సొంతింటి కలపై కోలుకోలేని దెబ్బ తీస్తుండగా ఏఐ ప్రభావం ఐటీ రంగాన్ని మరింత ఆందోళనలోకి నెట్టుతోంది. ఆటోమేషన్ వల్ల ఐటీ కంపెనీల రాబడిలో 2 నుంచి 3 శాతం తగ్గుదల ఉండవచ్చని ఐసీఐసీఐ డైరెక్ట్ అంచనా వేసింది. 2026లో ఇప్పటివరకు నిఫ్టీ ఐటీ ఇండెక్స్ దాదాపు 25 శాతం పడిపోయింది. గతంలో అమెరికా డెవలపర్ల కంటే భారతీయ డెవలపర్లు తక్కువ శాలరీలకే లభిస్తారనే ఆలోచనలతో ఐటీ కంపెనీలు నడిచాయి. కానీ ఇప్పుడు ఎఐ కోడింగ్ ఏజెంట్లు విద్యుత్ ఖర్చుతోనే పని పూర్తి చేస్తున్నాయి. దీనివల్ల టీసీఎస్, ఇన్ఫోసిస్,





విప్రో వంటి దిగ్గజాలకు ముప్పు పొంచి ఉందని 'సిట్రిని రీసెర్చ్' నివేదిక హెచ్చరించింది. దీంతో రాబోయే రోజుల్లో ఐటీ సెక్టార్ ఎలా ఉండబోతోంది? తద్వారా ఆ రంగంలోని ప్రభావం ఇతర రంగాలపై ఎలా పడబోతోంది అనేది ఉత్కంఠ రేపుతోంది.

## కంచె లేని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌లతో పొంచి ఉన్న ప్రమాదం

తుర్కయంజాల్: జీ హెచ్ ఎం సి ఆదిభట్ల సర్కిల్ పరిధిలో ఎక్కడ చూసినా కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ లే దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రజల ప్రాణాలకు పెను ముప్పుగా మారింది. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ల వద్ద హెచ్చరిక బోర్డులు, చుట్టూ కంచె ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నివాస ప్రాంతాలు, స్కూల్స్, కాలనీల మధ్యలో భద్రతా చర్యలు లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తుర్కయంజాల్ డివిజన్ పరిధిలోని మన్నెగూడ కాలనీ రోడ్ నెంబర్ 7 లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదకర పరిస్థితుల్లో కనబడుతున్నాయి. అలాగే రోడ్ నెంబర్ 10 లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఆనుకొని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె, హెచ్చరిక బోర్డులు లేకుండా ప్రమాదకర పరిస్థితి నెలకొంది. ప్రతిరోజూ స్కూల్‌కు వచ్చే, వెళ్లే చిన్నారులు ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరగా వెళ్లాల్సి వస్తుండటంతో ఎప్పుడైనా ప్రమాదం సంభవించే అవకాశం లేకపోలేదు.

# వైసీపీ రూట్ మార్చిందా?




విశాఖపట్టణం, : ఏపీ పాలిటిక్స్‌లో గాజువాకకు స్పెషల్ పొలిటికల్ బ్యాగ్రౌండ్ ఉంది. మిగిలిన నియోజకవర్గాల్లాగా..ఇక్కడ క్యాస్ట్ పాలిటిక్స్ చేయడం అంత ఈజీ కాదన్న అభిప్రాయం ఉంది. అయితే గత ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగానే కాదు..గాజువాకలోనూ వైసీపీ వేసిన వ్యూహాలు ఏ మాత్రం వర్కౌట్ కాలేదు. ఘోర పరాజయం తప్పలేదు. దీంతో ఇప్పుడు లోకల్ బాడీ ఎన్నికలకు ముందు వైసీపీ పెద్దలు కాస్త అలర్ట్ అయినట్లు కనిపిస్తోంది. గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని వైసీపీ స్టేట్ పొలిటికల్ అఫైర్స్ కమిటీలో సభ్యుడిగా నియమించింది. వైసీపీకి పీఏసీ అనేది చాలా ప్రెస్టీజియస్. సీనియర్ లీడర్లు, మాజీ మంత్రులు, కీలక నేతలకు మాత్రమే చోటు దక్కుతుంది.కానీ గాజువాకలో కేవలం ఒకే ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిచిన తిప్పల నాగిరెడ్డిని పీఏసీలోకి తీసుకోవడం వెనుక వైసీపీ స్ట్రాటజీ ఏంటన్నది విశాఖ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. నాగిరెడ్డి కేవలం ఒకే ఒక్కసారి గెలిచినా సరే సంచలన విజయాన్ని రికార్డు క్రియేట్ చేశారు. 2019లో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను 16వేల ఓట్లతో ఓడించి తన పేరు రీసౌండ్ చేసేలా గుర్తింపు పొందారు. అయితే మాత్రం ఏం లాభం..గత ఎన్నికల్లో వైసీపీ అనూహ్యంగా ఆయన్ను పక్కన పెట్టింది. వృద్ధాప్యం.. అనారోగ్యం.. కారణంగా తన కుమారుల్లో ఎవరో ఒకరికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలం టూ నాగిరెడ్డి హైకమాండ్‌కు ఛాయిస్ ఇచ్చి సైలెంట్ అయిపోయారు. పవన్‌ను ఓడించిన నేతగా నాగిరెడ్డికి క్రెడిట్ ఉన్నా తన కుమారులకు టికెట్ ఇవ్వాలంటూ ఆయన చేసిన రిక్వెస్ట్‌ను వైసీపీ అధిష్టానం లైట్ తీసుకుంది. క్యాస్ట్ ఈక్వేషన్స్‌తో యాదవ సామాజికవర్గానికి చెందిన నేతను బరిలో నిలిపితే విజయం వరిస్తుందని అంచనా వేసి ఉరుకూటి చందు అనే నేతకు నియోజకవర్గ బాధ్యతలు కూడా అప్పగిం చారు. వైసీపీ తీసుకున్న ఈ నిర్ణయం గాజువాకలో గందరగోళం సృష్టించినా సరే పార్టీ పెద్దలు వెనక్కి తగ్గలేదు. యాదవ సామాజికవ ర్గానికి చెందిన ఉరుకూటి చందుకే టికెట్ అనే సంకేతాలను బలంగా పంపారు. అంతా బాగానే ఉందనుకున్న సమయంలో..కాపు సామాజికవర్గానికి చెందిన గుడివాడ అమర్‌నాథ్‌ను లాస్ట్ మినిట్‌లో గాజువాక బరిలోకి దించారు. కూటమి తరుపున యాదవ సామాజి కవర్గ నేత పల్లా శ్రీనివాసరావు బరిలోకి దిగడంతో..కాపు ఈక్వేషన్స్.. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ అంటూ వైసీపీ వేసిన స్కెచ్‌లన్నీ గాల్లో కొట్టుకుపోయాయి. రాష్ట్రంలోని 175 ఎమ్మెల్యేల్లో.. గాజువాకలోనే టీడీపీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌కు అత్యధిక మెజార్టీ వచ్చింది.ఘోర ఓటమి తర్వాత ఇప్పుడు వైసీపీ పెద్దలకు అసలు సీన్ అర్థమైందన్న టాక్ వినిపిస్తోంది. త్వరలో స్థానిక, విశాఖ కార్పొరేషన్ ఎన్నికలు రానుండటంతో పట్టు నిలుపుకోవాలన్న ఉద్దేశంతో కీలక నిర్ణయాలు తీసుకుంటుందట. ఇందులో భాగంగా తిప్పల నాగిరెడ్డిని మళ్లీ తెరపైకి తెచ్చారని అంటున్నారు. అప్పటికే అనారోగ్యంతో ఉన్నానని, వయోభారంతో రాజకీయాల్లో కొనసాగలేనని రెండేళ్ల క్రితమే చేతులెత్తేసిన తిప్పల నాగిరెడ్డిని మళ్లీ పొలిటికల్ స్క్రీన్ తెస్తూ..పార్టీ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ మెంబర్‌గా నియమించింది. ఈ నిర్ణయం వెనుక వైసీపీ పెద్ద కసరత్తే చేసిందన్న టాక్ వినిపిస్తోంది.ప్రస్తుతం వైసీపీకి గాజువాకలో దిక్కూమొక్కూ లేదు. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన గుడివాడ అమర్‌నాథ్ చోడవరం నియోజకవర్గానికి వెళ్లిపోయారు. దీంతో వైసీపీకి నియోజకవర్గాన్ని నడిపే నాయకుడు కరువయ్యాడు. గ్రేటర్ విశాఖ సిటీలోనే ఇలాంటి దుస్థితి ఉంటే కష్టమని భావించి నాగిరెడ్డికి హితబోధ చేసి మరీ ఈ బాధ్యతలు అప్పగించారని గుసగుసలు వినిపిస్తున్నాయి. వచ్చే ఎన్నికల్లో టికెట్ సంగతి తర్వాత ముందు నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాలని నాగిరెడ్డికి టాస్క్ ఇచ్చారట. చెరోదారిలో వెళ్లిపోయిన తన కుమారులను కూడా దారికి తెచ్చుకుని పార్టీకో దారి చూపిస్తారనే ఆశలతోనే వైసీపీ నాగిరెడ్డికి పీఏసీ చాన్స్ ఇచ్చారని అంటున్నారు.

## దేశం నుంచి పారిపోవడానికి..

# పదేండ్లుగా ప్రణాళిక!

### ఎట్టకేలకు ఉత్తర కొరియా నుంచి తప్పించుకున్న ఓ కుటుంబం




సియోల్: ఉత్తర కొరియా.. ఈ పేరు వింటేనే ఒక నియంత.. కఠిన నిబంధనలు, ఆంక్షలు.. అగ్రరాజ్యం అమెరికాను సైతం భయపెట్టేలా అప్పుడప్పుడు క్షిపణి ప్రయోగాలు మనకు గుర్తుకు వస్తుంటాయి. ఎన్నో కఠిన ఆంక్షలు ఉన్న ఆ దేశం నుంచి ఒక కుటుంబం విజయవంతంగా తప్పించుకున్న వైనాన్ని సీఎన్ఎన్ వెల్లడించింది. అయితే ఇది రాత్రికి రాత్రేమీ జరిగిపోలేదు. దాని కోసం ఆ కుటుంబం 10 ఏండ్ల పాటు వేసిన ప్రణాళికలు, దానిని అమలు చేసేందుకు పన్నిన పథకాలు ఏ హాలీవుడ్ సినిమాకు తీసిపోని విధంగా ఉన్నాయి. కిమ్ఇల్ హ్యోక్ అనే వ్యక్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేని ఉత్తర కొరియా నుంచి తన కుటుంబంతో సహా పారిపోవాలని అనుకున్నాడు. దాని కోసం 10 ఏండ్లుగా ప్రణాళికలు వేస్తూ దశలవారీగా అమలు చేయడం ప్రారంభించాడు. సాధారణంగా దేశం నుంచి పారిపోయే వారు నదిని దాటి చైనాలోకి వెళ్లడానికి ప్రయత్నిస్తుంటారు. ఇది అత్యంత సాధారణ మార్గం. కానీ చైనాలో దొరికితే తిరిగి ఉత్తర కొరియాకు పంపే ప్రమాదం కూడా ఉంది. కానీ కొందరు కొరియన్ డీమిలిటరైజ్డ్ జోన్ (డీఎంజడ్) ద్వారా దక్షిణ కొరియా వెళ్లడానికి ప్రయత్నిస్తారు. సైన్యం, మైన్స్, గన్స్‌తో ఉండే ఇది చాలా ప్రమాదకరం. కిమ్ఇల్ హ్యోక్ ఈ మార్గాన్నే ఎంచుకున్నాడు. 2023 మేలో వారు అత్యవసరంగా దేశం నుంచి తప్పించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రకృతి కూడా సహకరించిందన్నట్టుగా, ఆ రోజు రాత్రి భారీ వర్షం కురవడం ప్రారంభించింది. దీంతో వారు ఆ వానలోనే ఒక చేపల పడవలో ప్రయాణం ప్రారంభించారు. ఒక గార్డుకు లంచం ఇచ్చి ఎల్లో సీలో చేపల వేటకు అనుమతి పొందారు. కిమ్ భార్య, అతని తల్లి, అతని వదిన, హ్యోక్ అత్త పడవలో గోనెసంచుల అడుగున కదలకుండా పడుకున్నారు. తర్వాత ఆ పడవ తీరం నుంచి దూరంగా వెళ్లిపోయింది. ఆ సమయంలో తమ గుండె పడవ ఇంజన్ కన్నా గట్టిగా కొట్టుకుందని కిమ్ తర్వాత పేర్కొన్నారు. సుమారు రెండు గంటల తర్వాత సముద్ర సరిహద్దు జలాల వద్దకు చేరుకున్నారు. అక్కడ కనుక ఉత్తర కొరియా పెట్రోలింగ్ సిబ్బందికి దొరికారో వారిని చంపడమో, జీవితాంతం జైలులో వేయడమో చేసేవారు. అయితే అదృష్టం వారివైపు ఉంది. మెల్లిగా వారి పడవ ఉత్తర పరిమితి రేఖను దాటింది. తర్వాత వారు దక్షిణ కొరియాలోని యెన్ప్యోంగ్ ద్వీపానికి చేరుకున్నారు. దక్షిణ కొరియా నావికా సిబ్బంది వారిని తొలుత అదుపులోకి తీసుకున్నారు. తర్వాత ఉత్తర కొరియా నుంచి వచ్చినట్టు నిర్ధారించుకుని ఆశ్రయం కల్పించారు.

# ఆటో డెబిట్ చేయాలంటే 24 గంటల ముందే సమాచారం

ముంబై, : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) బ్యాంకింగ్ కస్టమర్ల కోసం మరికొన్ని కొత్త నిబంధనలను ప్రవేశపెట్టింది. ఇక నుంచి బ్యాంకులు ఎలా పడితే అలా మీ అకౌంట్ నుంచి మనీ ఆటోడెబిట్ చేసుకోవడానికి వీల్లేదు. కస్టమర్ల భద్రత కోసం ఆర్బీఐ కఠిన నిబంధనలు తీసుకొచ్చింది. ఇక నుంచి ఆటో డెబిట్ చేయాలంటే కస్టమర్‌కు తప్పనిసరిగా 24 గంటల ముందు ఎస్ఎంఎస్ లేదా ఈమెయిల్ ద్వారా సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఎంత కట్ చేస్తు?న్నారు..? దానికి గల కారణాన్ని తెలపాల్సి ఉంటుంది. ఓటీటీ సబ్‌స్క్రిప్షన్, ఇన్సూరెన్స్ ప్రీమియం, కారు లోన్ ఈఎంఐ, హోమ్ లోన్ వంటి వాటన్నింటికీ ఈ నిబంధన వర్తిస్తుంది. బ్యాంకు ముందస్తుగా సమాచారం ఇవ్వకుండా ఆటో డెబిట్ చేసుకుంటే కస్టమర్లు ఫిర్యాదు చేయవచ్చు.ఆటో డెబిట్ చేసుకోవాలనుకుంటే 24 గంటల ముందు బ్యాంకులు మీకు నోటిఫికేషన్ పంపుతాయి. దీని వల్ల ఈఎంఐకు అవసరమైన డబ్బులను మీరు అకౌంట్లో ఉంచుకుంటారు. దీని వల్ల మీరు లేట్ ఫీజులు చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఇక ఒకవేళ ఆటో డెబిట్ తప్పు అని భావిస్తే మీరు బ్యాంక్ పంపించే నోటిఫికేషన్ ద్వారా రద్దు చేసుకోవచ్చు. బ్యాంకులు ఇక నుంచి ఇష్టానుసారం కస్టమర్‌కు ముందుగానే సమాచారం ఇవ్వకుండా డబ్బులు ఆటో డెబిట్ చేసుకోకూడదు. ముందుగా మీ అనుమతి, మీకు సమాచారం ఇచ్చాకే ఆటో డెబిట్ చేసుకోవాలి. ముందుగానే వచ్చే మెస్సేజ్ ద్వారా వివరాలు ఏదైనా తప్పు ఉంటే బ్యాంకును సంప్రదించవచ్చు. అమౌంట్ తప్పుగా ఉంటే సవరించుకోవచ్చు.ఒకవేళ 24 గంటల ముందే బ్యాంకులు మీకు ఆటో డెబిట్‌కు సంబంధించి సమాచారం ఇవ్వకపోతే ఫిర్యాదు చేయవచ్చు. ఇందుకోసం బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చు. ఇక వినియోగదారుడి సమ్మతి లేకుండా ఒక్క రూపాయి కూడా బదిలీ చేసుకునే హక్కు బ్యాంకులకు లేదని ఆర్బీఐ స్పష్టం చేసింది. దీనికి సంబంధించి బ్యాంకులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అన్ని బ్యాంకులు దీనిని తప్పనిసరిగా పాటించాలని ఆర్బీఐ కొత్త నిబంధనల్లో పేర్కొంది. చాలామంది ఈఎంఐల గురించి మర్చిపోతారు. దీని వల్ల ఈఎంఐ సమాయానికి అకౌంట్‌లో డబ్బులు లేకపోతే బ్యాంకులు బౌన్స్ ఛార్జీలు విధిస్తూ ఉంటాయి. ఇక నుంచి అలాంటి ఛార్జీలు మీకు ఉండవు. బ్యాంకులు ముందే సమాచారం ఇవ్వడం వల్ల మీ అకౌంట్లలో ఆ టైమ్‌కి డబ్బులు ఉంచుకుంటారు. బౌన్స్ ఛార్జీలను బ్యాంకులు భారీగా వసూలు చేస్తున్నాయి. దీనికి ఇప్పటినుంచి చెక్ పడనుందని చెప్పవచ్చు.

# డీలిమిటేషన్ అధికార కూటమికి బ్రహ్మాస్త్రం

విజయవాడ : డీలిమిటేషన్ దెబ్బ నుంచి తృటిలో వైసీపీ తప్పించుకుంది. పార్లమెంట్ లో ఈ నెల 17న ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ఓటమి పాలు కావడం వైసీపీకి లోలోపల ఆనందాన్ని ఇచ్చింది అని అంటున్నారు. ఎందుకంటే ఈ బిల్లు కనుక సవ్యంగా పాస్ అయి ఉంటే ఏపీలో తొలి దెబ్బ వైసీపీకే పడేది అని అంటున్నారు. అధికారంలో కూటమి ప్రభుత్వం ఉంది. చంద్రబాబు సీఎం గా ఉన్నారు. ఆయన అపర చాణక్యంతో డీలిమిటేషన్ ప్రక్రియ జరిగింది అంటే వైసీపీ బలమంతా దూది పింజె మాదిరిగా ఎగిరిపోయేదని విశ్లేషణలు ఉన్నాయి. వైసీపీ బలం ఉన్న చోట్ వీక్ చేస్తూ ఆ పార్టీ పుట్టె ముంచగలిగే విధంగా ఈ డీలిమిటేషన్ అధికార కూటమికి ఒక బ్రహ్మాస్త్రంగా పనిచేసేది అని అంటున్నారు. ముఖ్యంగా రాయలసీమ వైసీపీకి హార్డ్ కోర్ రీజియన్. ఇక్కడ ఫ్యాన్ పార్టీ కకావికలు అయ్యే విధంగా కూటమి భారీ స్కెచ్ రూపొందించింది అన్న వార్తలు కూడా ఆ మధ్య వినిపించాయి. ఆఖరికి వైసీపీ అధినేత జగన్ సొంత నియోజకవర్గం పులివెందుల సైతం రెండు ముక్కలు అయ్యేదని వైసీపీ కుటుంబానికి యాభై ఏళ్ళుగా కంచుకోటగా ఉన్న ప్రాంతం పూర్తిగా కొత్త రూపు సంతరించుకుంటే జగన్ కి పోటీ చేసేందుకు సైతం వేరే నియోజకవర్గం ఎంపిక చేసుకునే పరిస్థితి ఉండేదని కూడా చర్చ సాగింది. అంతే కాదు వైసీపీకి చెందిన దిగ్గజ నేతల స్థావరాలు సైతం డీలిమిటేషన్ ప్రక్రియలో కొట్టుకుని పోయేవని కూడా ప్రచారం సాగింది. అయితే డీలిటేషన్ ప్రక్రియ అన్నదే లేకుండా చివరిలో ఇండియా కూటమి యాంటీ చేసి గండి కొట్టింది. మహిళా బిల్లుని ప్రతిపక్షాలు అడ్డుకున్నాయని డీలిమిటేషన్ కాకుండా చేశారు అని జగన్ భారీ ట్వీట్ చేసి మరీ జాతీయ స్థాయిలో విపక్షాలను విమర్శించినా లోగుట్టు అయితే వైసీపీకి ఈ పరిణామం మహదానందం కలిగించింది అని అంటున్నారు. విపక్షం అంతా ఒక్కటిగా నిలిచి బిల్లుని ఓడించకపోతే ఈపాటికి దేశంలో విపక్షాల భయాలు సందేహాలు ఎలా ఉన్నా ఏపీలో మాత్రం వైసీపీకి అసలుకే ఎసరు వచ్చేసి ఉండేదని అంటున్నారు. దీంతో వైసీపీ నేతలు అంతా ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు అని అంటున్నారు. అయితే కేంద్రంలో మోడీ ప్రభుత్వానికి ఇంకా చేతిలో మూడేళ్ళ పాటు అధికారం ఉంది. దాంతో పాటుగా పట్టుదలకు మారు పేరు అయిన ఆయన మరో రూపంలో కనుక ఈ డీలిమిటేషన్ బిల్లు తీసుకుని వస్తే ఎలా అన్నదే చర్చగా ఉంది. అంతే కాకుండా ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వంలో బీజేపీ ఉంది. కేంద్రంలో టీడీపీ మంత్రులు ఉన్నారు. కాబట్టి డీలిమిటేషన్ ప్రక్రియ జాతీయ స్థాయిలో నిలిచిపోయినా ఏపీ తెలంగాణా రాష్ట్రాల మేరకు అసెంబ్లీ సీట్ల పెంపుదలకు గట్టిగా పట్టుబట్టి ఒప్పించినట్లు అయితే ఆ రూపంలో అయినా సీట్లు పెరుగుతాయని అంటున్నారు. అదే జరిగితే పులి మీద పుట్ర అన్నట్లు మరో కొత్త ముప్పు వైసీపీకి పొంచి ఉన్నట్లే అని అంటున్నారు. ఏది ఏమైనా ప్రస్తుతానికి మాత్రం వైసీపీకి భారీ రిలాక్స్ అయితే వచ్చిందని అంటున్నారు. మరి ఇంతా చేసి ఎందుకు డీలిమిటేషన్ బిల్లుకు వైసీపీ మద్దతు ఇచ్చింది అంటే అక్కడే ఉంది రాజకీయ మతలబు అని అంటున్నారు. కేంద్రంలోని మోడీ సర్కార్ కి చెడ్డ కాకుండా అక్కడ ఓటేసినా మనసంతా డీలిమిటేషన్ బెంగతోనే నిండిపోయిందని అంటున్నారు. అలా వైసీపీ బెంగ పడిన వేళ కాగల కార్యాన్ని ఇండియా కూటమి తీర్చేసింది అని అంటున్నారు. మొత్తం మీద అయితే రాహుల్ గాంధీకి వైసీపీ థాంక్స్ చెప్పుకోవాలని సోషల్ మీడియా వేదికగా కామెంట్స్ పడుతున్నారు



### రైల్వే కోడూరు రోడ్డులో గాయాలతో కనిపించిన జింక.. తిరుపతికి తరలింపు

రైల్వే కోడూరు : రైల్వే కోడూరు పట్టణ పరిధిలో ఓ జింక తీవ్ర గాయాలతో రోడ్డుపై కనిపించిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. పట్టణంలోని ఎంజీ రోడ్డులో గాయాలపాలై నిస్సహాయ స్థితిలో పడి ఉన్న జింకను గమనించిన స్థానికులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. లారీ పైనుంచి కింద పడటం వల్లే జింకకు ఈ తీవ్ర గాయాలు అయి ఉంటాయని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న ఫారెస్ట్ అధికారులు, గాయపడిన జింకను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దానికి ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం, సంరక్షణ నిమిత్తం జింకను తిరుపతికి తరలిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, అధికారులు వచ్చేంత వరకు జింకను స్థానికులు నీరు తాపించి.. సురక్షితంగా చూసుకున్నారు.



# పామును పసిగట్టే పరికరం!



న్యూఢిల్లీ,: గ్రామీణ భారతంలో పాము కాటు మరణాలను నివారించే లక్ష్యంతో కిసాన్ మిత్ర ఛడీ అనే కొత్త ఎలక్ట్రానిక్ పరికరం అందుబాటులోకి వచ్చింది. వెలుగు తక్కువగా ఉండే ప్రాంతాల్లో తరుచూ పనిచేసే రైతులు పాముకాటుకు గురికావడం దేశంలో సర్వసాధారణంగా మారిపోయింది. గ్రామీణ భారతంలో ముఖ్యంగా వ్యవసాయ కూలీలు ఎక్కువ పనిచేసే ప్రదేశాల్లో పాముకాటు అనేది ముఖ్యమైన ప్రజారోగ్య సమస్యగా కొనసాగుతున్నది. కాగా తక్కువ ఖర్చుతో లభించే సాంకేతిక పరిష్కారాలు పాము కాటు ముప్పును తగ్గించి వ్యవసాయ పనుల్లో ఆరోగ్య భద్రతను మెరుగుపరచడానికి దోహదం చేస్తాయి. దాదాపు 5 నుంచి 15 మీటర్ల దూరంలో దాగి ఉన్న సర్పాన్ని కూడా వైబ్రేషన్ టెక్నాలజీతో పనిచేసే కిసాన్ మిత్ర ఛడీ అనే ఈ పరికరం కనిపెడుతుంది. 100 మీటర్ల దూరంలో ఏదైనా సర్పం ఉంటే వెంటనే గట్టి వైబ్రేషన్ ద్వారా రైతుకు సిగ్నల్ ఇస్తుంది. రాత్రుళ్లు పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు పాము కాట్లకు గురికాకుండా నివారించడమే ఈ పరికరం ప్రధాన ఉద్దేశం. కిసాన్ మిత్ర ఛడీ అనే ఈఎలక్ట్రానిక్ కర్రను భారతీయ శాస్త్రవేత్తలు రూపొం దించారు. ఇది పాము కదలికలపై రైతులను ముందుగానే అప్రమత్తం చేస్తుంది. కేంద్ర వ్యవసాయ మంత్రి శివ్‌రాజ్ సింగ్ చౌహాన్ అధికారికంగా ఈ పరికరం పనితీరు గురించి వివరించారు. ముందు గా రైతు ఈ కర్రను నేలలో పాతి బటన్‌ని నొక్కాలి. వెంటనే పరిసరాల్లో (100 మీటర్ల దూరంవరకు) కదలికలను ఈ కర్ర స్కాన్ చేస్తుంది. ఇన్‌ఫ్రారెడ్ రేడియేషన్ లేదా నిర్దిష్టమైన వైబ్రేషన్ ఫ్రీక్వెన్సీల ద్వారా పామును గుర్తిస్తుంది. పామును గుర్తించిన తర్వాత కర్ర గట్టిగా వైబ్రేట్ అవుతుంది. దీంతో రైతు పాముబారిన పడకుండా తప్పించుకో వచ్చు. ప్రమాదవశాత్తు పాము కాటుకు గురై ఏటా కొన్ని వేల మంది మరణిస్తున్న దృష్ట్యా ఈ మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించడా నికి ఈ కర్ర ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ఈ పరికరంలో ఉండే సెన్సార్లు పాము కదలికలు, దాని బుసను ఆధారం చేసుకుని రైతులను అప్రమత్తం చేయగలవని ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ సైంటిఫిక్ రిసెర్చ్ అండ్ ఇంజినీరింగ్ డెవలప్‌మెంట్ వివరించింది.

# అమెరికాను వీడుతాం..

### 40 శాతం మంది భారతీయుల అభిప్రాయమిదే



వాషింగ్టన్, : ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో అమెరికాకు వెళ్లిన ప్రవాస భారతీయుల కలలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ పగ్గాలు చేపట్టింది మొదలు అక్కడి ప్రవాస భారతీయులకు కష్టాలు మొదలయ్యాయి. 40 శాతం మంది భారతీయ అమెరికన్లు ఆ దేశాన్ని వీడాలని భావిస్తున్నట్టు తాజా సర్వే ఒకటి వెల్లడించింది. అమెరికాలో భారత సంతతి ప్రజలు 52 లక్షల మంది నివసిస్తున్నారని గణాంకాలు చెబుతున్నాయి. వీళ్లందరిలో 'అమెరికా డ్రీమ్' కనుమరుగు అవుతున్నదని సర్వే అభిప్రాయపడింది. ఈ మార్పునకు ప్రధాన కారణం అమెరికాలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ వాతావరణమే. 'కార్నెగీ ఎండోమెంట్' తాజా సర్వేలో భాగంగా.. 1,000 మంది నుంచి సేకరించిన అభిప్రాయాలు విశ్లేషించగా, అమెరికాను వీడాలని తరచూ ఆలోచిస్తున్నామని 14 శాతం మంది, అప్పుడప్పుడు ఆలోచించామని 26 శాతం మంది చెప్పారు. ప్రతి పది మందిలో ఆరుగురు (58 శాతం) అమెరికా రాజకీయాలతో విసిగిపోయామని చెప్పగా, 41 శాతం మంది వ్యక్తిగత భద్రతపై ఆందోళనతో ఉన్నట్టు సర్వే పేర్కొన్నది. ఆర్థిక ఒత్తిళ్లు.. జీవన వ్యయం: అమెరికా నగరాల్లో జీవన వ్యయం భరించలేనిదిగా మారిపోయింది. శాన్‌ఫ్రాన్సిస్కో, సియాటిల్, న్యూయార్క్ వంటి నగరాల్లో ఒక బెడ్‌రూమ్ అపార్ట్‌మెంట్‌కు నెల అద్దె 3,000 నుంచి 5,000 డాలర్ల వరకు ఉంటున్నది. ప్రధాన పట్టణ, టెక్ హబ్‌లలో కుటుంబ వ్యయం మధ్య తరగతికి చాలా భారంగా మారింది. మరోవైపు ద్రవ్యోల్బణం, ఉద్యోగ భద్రత ఆందోళన కలిగిస్తున్నది. భారత సంతతి పౌరుల్లో 71 శాతం మందికి ట్రంప్ సర్కార్ అనుసరిస్తున్న అమెరికా ఆర్థిక, వలస విధానాలు, అంతర్జాతీయ సంబంధాలు ఎంతమాత్రమూ నచ్చటం లేదు. 'అమెరికా అమెరికన్ల కోసమే' అన్న రాజకీయ విధానం, నినాదాన్ని నొక్కి చెప్పే ప్రసంగాలు భారతీయ అమెరికన్లను ఆందోళనకు గురిచేస్తున్నాయి. అమెరికాకు చెందిన వారిమనే భావన వారిలో తగ్గించిందని విశ్లేషకులు చెబుతున్నారు.

# ఇక చైనాకు చుక్కలే

న్యూఢిల్లీ: ప్రపంచ దృష్టి పశ్చిమాసియా యుద్ధం, శాంతి చర్చలపై ఉంది. దేశ ప్రజల దృష్టి ఐదు రాష్ట్రాల ఎన్నికలు, వాటి ఫలితాలపై ఉంది. ఈ సమయంలో కేంద్రం దేశ సరిహద్దులో మొదలు పెట్టిన ఓ పనిని పూర్తిచేసే దిశగా చర్యలు చేపట్టింది. లద్దాక్‌లో కీలక టన్నెల్ పనులను దాదాపు ముగించబోతోంది. బాల్క్ నుంచిమీనామార్గ్ వరకు 13 కిలోమీటర్ల పొడవైన జోజులా పర్వతాన్ని తవ్వుతూ, రోజుకు 4 మీటర్ల వేగంతో పనులు జరుగుతున్నాయి. మే 30 నాటికి మిగిలిన 300 మీటర్లు పూర్తి చేయబోతున్నారు. దీనికి న్యూ ఆస్ట్రియన్ టన్నెలింగ్ పద్ధతి వాడుతున్నారు. అక్టోబర్ నుంచి ఏప్రిల్ వరకు జోజులా పాస్ మంచుతో కప్పిపోతూ, శ్రీనగర్ లద్దాక్ మార్గం మూసుకుపోతుంది. స్థానికులు ఆహారం, మందులు నిల్వ చేసుకుంటారు; సైన్యం ఇంటర్ కంటినెంట్ ప్లాన్లతో స్వయం సమృద్ధిగా ఉంటుంది. ఈ టన్నెల్ పూర్తయితే, 365 రోజులు వాహనాలు, భారీ ఆయుధాలు తరలింపునకు వీలవుతుంది. ప్రస్తుతం 29 కి.మీ./గం వేగం 70 కి.మీ./గం అవుతుంది. దూరం, ఖర్చు గణనీయంగా తగ్గుతాయి. 2018 నుంచి చైనా లద్దాక్ భూభాగాలను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తోంది, భారత్ ధైర్యంగా తిప్పికొట్టింది. ఈ ప్రాజెక్ట్ చైనా-పాక్ సరిహద్దుల్లో సైనిక ఉద్దీపనను బలోపేతం చేస్తుంది. హిమాచల్ నుంచి దక్షిణ లద్దాక్‌కు ఆధార మార్గం (నిము పదుమ్ దార్చా) జోజులాను మరింత కీలకం చేస్తుంది. శింకు లా టన్నెల్ (4.1 కి.మీ., 15,800 అడుగుల ఎత్తు) కూడా హిమాచల్ లద్దాక్ కనెక్ట్‌ను లింక్ చేస్తుంది. ఈ ఇన్‌ఫ్రా పుష్ రక్షణ భద్రతను పెంచడమే కాక, వాణిజ్యం, పర్యాటకం, స్థానిక ఆర్థిక వ్యవస్థను ఉత్తేజపరుస్తుంది. బిలాస్పూర్-మనాలీ-లెహ్ రైలు (రూ.1.31 లక్షల కోట్లు), లెహ్ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ (రూ.640 కోట్లు)లతో కలిపి లద్దాక్ 'ట్సునామి ఆఫ్ డెవలప్‌మెంట్'కు సాక్షియైంది. రూ.20,660 కోట్లు రోడ్లకు కేటాయించారు. బీఆర్‌వో ప్రాజెక్ట్ విజయక్‌లో లెహ్?చాలుంకా, కార్గిల్ దుమ్గిల్ మార్గాలు మెరుగయ్యాయి.

# భవిష్యత్తుకు తగ్గ అధ్యాపకులను తీర్చిదిద్దుతాం

### గీతం స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఫ్యాకల్టీ రూమ్స్, కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవంలో డాక్టర్ రిచా శర్మ



పటాన్ చెరు: భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న అధ్యాపకులను తీర్చిదిద్దే చైతన్యవంతమైన కేంద్రంగా గీతం స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ను రూపొందించినట్టు విభాగాధిపతి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రిచా శర్మ పేర్కొన్నారు. హైదరాబాదు లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కోసం కొత్తగా రూపొందించిన అధ్యాపకుల గదులు, విద్యార్థుల కోసం నెలకొల్పిన కంప్యూటర్ ల్యాబ్ ను అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు శుక్రవారం లాంఛనంగా ప్రారంభించి, అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఆయా ప్రదేశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ రిచా శర్మ మాట్లాడుతు ఈ కొత్త మౌలిక సదుపాయాల వెనుక ఉన్న దార్శనికతను వివరించారు. విద్యా పరమై న సహకారాన్ని, అర్థవంతమైన సంభాషణలను ప్రోత్సహించి, భవిష్య త్తు అవసరాలకు అనుగుణంగా అధ్యాపకులను తీర్చిదిద్దుతున్నట్టు తెలియ జేశారు. వినూత్నమైన అభ్యాస వాతావరణాన్ని సృష్టించడం ద్వారా గీతం యొక్క బహుళ విషయక విద్యా సంస్కృతిని బలోపేతం చేయడానికి తమ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కట్టుబడి ఉందన్నారు. జాతీయ విద్యా విధానం-2020 దార్శనికతకు అనుగుణంగా, 2026 -27 విద్యా సంవత్సరం నుంచి రెండు నాలుగేళ్ల సమీకృత ఉపాధ్యా య విద్యా కార్యక్రమాలను (ఐటీఈపీ) ప్రారంభించనున్నట్టు కూడాడాక్టర్ రిచా శర్మ ప్రకటించారు. విషయ పరిజ్ఞానాన్ని వృత్తిపరమైన ఉపాధ్యాయ శిక్షణతో అనుసంధానించేలా బీఎస్సీ బీఈడీ, బీఏ బీఈడీ కోర్సులను రూపొందించినట్టు తెలియజేశారు. బలమైన బోధనా నైపుణ్యాలు, తరగతి గది నిర్వహణ సామర్థ్యాలు, సమకాలీన విద్యా పద్ధతులపై విద్యార్థులు లోతైన అవగాహనను పెంపొందించుకుంటూ, సైన్స్, గణితం, ఆంగ్లం లేదా సాంఘిక శాస్త్రాలలో ప్రత్యేకత సాధిస్తారని ఆమె వివరించారు. వ్యక్తిగత మార్గదర్శనం, ఉన్నత-నాణ్యత గల విద్యా ప్రమాణాలను నిర్ధారించడానికి, ఒక్కో కోర్సులో 50 మంది విద్యార్థులకు మాత్రమే ప్రవేశం కల్పిస్తామని డాక్టర్ రిచా శర్మ వెల్లడించారు. ప్రతిభావంతులైన అభ్యర్థులకు ఉపకార వేతనాలిచ్చి ప్రోత్సహిస్తున్నామన్నారు. నిష్పక్షపాతమైన, ప్రతిభ ఆధారిత ఎంపిక ప్రక్రియను నిర్ధారిస్తూ, జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి తరపున జాతీయ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఎన్.సీ.ఆర్.టీ)లో చూపిన ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని ఆమె స్పష్టీకరించారు.

# గృహ నిర్మాణదారులపై భారం

**- యుద్ధంతో భారీగా పెరిగిన మెటీరియల్ ధరలు**
**- కొనుగోలుకు వెనకడుగు**

కృష్ణా: ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయిల్ చేస్తోన్న యుద్ధ ప్రభావం గృహ నిర్మాణ రంగంపైనా పడింది. రంగులు, టైల్స్, ఉపకరణాలు, పివిసి పైపుల ధరలు భారీగా పెరిగాయి. పెట్రోలియం ఉత్పత్తుల బై ప్రొడెక్టులతో వీటిని తయారు చేస్తారు. యుద్ధం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పారిశ్రామిక డీజిల్‌పై లీటర్‌కు రూ.22 పెంచింది. గృహ నిర్మాణాల్లో అత్యంత కీలకంగా ఉపయోగించే పెట్రోలియం అనుబంధ ప్లాస్టిక్ ఉత్పత్తుల ధరలు భారీగా పెరగడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులు, సొంతంగా ఇళ్లు నిర్మించుకుంటున్న వారు, బిల్డర్లు ఆందోళన చెందుతున్నారు. ఆయా పరికరాల కొనుగోలుకు గృహ నిర్మాణదారులు వెనుకాడడంతో అమ్మకాలు తగ్గాయని వ్యాపారులు చెప్తున్నారు. రెండు వారాల్లో పది అడుగుల పొడవు, అంగుళం వ్యాసార్థం ఉన్న పివిసి పైపు ధర రూ.50 నుంచి రూ.70కు, 20 అడుగుల పొడవు, నాలుగు అంగుళాల డ్రెయినేజీ పైపు రూ.740 నుంచి రూ.1150కు, పివిసి పైపులకు ఉపయోగించే ఎల్‌బోలు, బెండ్‌లు, బాక్సులు 60 శాతం వరకు, ఆరు యాంప్స్ స్విచ్ రూ.22 నుంచి రూ.28కు, ఎలక్ట్రికల్ కేబుల్స్ (వైర్ కాయల్) ధర రూ.1,750 నుంచి రూ.2,100కు పెరిగింది. నాలుగు లీటర్ల పెయింట్ డబ్బా రూ.1,100 నుంచి రూ.1,200కు, తిన్నర్ (కర్పంటాయిల్) లీటరు రూ.100 నుంచి రూ.125కు చేరుకుంది. చెక్క పాలిష్ వేయడానికి అవసరమైన తిన్నర్ సరఫరాను కంపెనీలు నిలిపివేశాయి. డీలర్లకు స్టాక్‌లేదని కంపెనీలు చెబుతున్నాయి. ఏప్రిల్ ఒకటి నుంచి రంగులు, టిన్నర్ తదితరాల ధరలు మరో 15 శాతం వరకు పెంచుతున్నట్లు ఆయా కంపెనీల నుండి సెల్ ఫోన్లకు సందేశాలు వచ్చాయని వ్యాపారులు చెబుతున్నారు.



గృహ నిర్మాణానికి ఉపయోగించే వివిధ రకాల మెరిటీయల్ ధరలు యుద్ధం వల్ల 20 శాతం వరకు పెరిగాయి. దీనికి ముందే ఇనుము ధర టన్ను రూ.63 వేల నుంచి రూ.75 వేలకు పెరిగింది. ప్రస్తుతం రూ.78 వేలకు చేరుకుంది. దీంతో, గృహ నిర్మాణం భారంగా మారింది.కృష్ణా జిల్లాలో 16,511 మందికి వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద గృహాలు మంజూరయ్యాయి. 400 మంది లబ్ధిదారులు ఉగాదికి గృహ నిర్మాణాలు పూర్తి చేశారు. మరో 16,111 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి. ప్రభుత్వ గృహ పథకం కింద 300 చదరపు అడుగుల్లో నిర్మించుకునే గృహానికి రెండు వేల కిలోల ఇనుము, వెయ్యి చదరపు అడుగుల్లో డబుల్ బెడ్‌రూమ్ గృహ నిర్మాణానికి ఐదు వేల కిలోల ఇనుము అవసరం. గతంతో పోలిస్తే 300 చదరపు అడుగుల్లో నిర్మాణం చేపట్టిన వారు రూ.30 వేలు, వెయ్యి చదరపు అడుగుల్లో గృహ నిర్మాణం చేపట్టిన వారు రూ.75 వేలు అదనంగా ఐరన్ కొనుగోలుకే ఖర్చు చేయాల్సి వస్తోంది. పెరిగిన విద్యుత్ ఉపకరణాలు, రంగులు తదితరాల ఖర్చులన్నీ కలుపుకుంటే లబ్ధిదారులపై రూ.50 వేలు, వ్యక్తిగతంగా గృహాలు నిర్మించుకునేవారిపై రూఫ్ సీలింగ్‌తో కలిపి రూ.4 లక్షల వరకు అదనపు భారం పడుతోందని చెబుతున్నారు.

# వివాదాల్లో హ్యాట్రిక్ ఎమ్మెల్యే

శ్రీకాకుళం,: శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజకవర్గానికి గేట్ వే ఆఫ్ ఏపీ అని పేరు. నేతలు ఎవరైనా.. పార్టీ ఏదైనా.. పాదయాత్రలు అంటే టక్కున గుర్తొచ్చే పేరు ఇచ్చాపురం. టీడీపీకి తిరుగులేని ఆధిపత్యం ఉన్న నియోజకవర్గం అది. ఇక్కడి నుంచి సైకిల్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ కొట్టారు బెందాళం అశోక్. ప్రస్తుతం ప్రభుత్వ విప్ పదవిలో కూడా ఉన్నారు. 2019లో జగన్ హవాను తట్టుకొని సైతం ఆయన గెలిచారు. కూల్ అండ్ సైలెంట్ రాజకీయాలు చేస్తారని ఆయనకు పేరు. ఎక్కువగా తన నియోజకవర్గానికే పరిమితం అవుతూ.. పాలిటిక్స్ నడిపిస్తూ ఉంటారు. సైలెన్స్‌కు కేరాఫ్‌గా ఉండే బెందాళం అశోక్.. ఒక్కసారి వయలెంట్‌గా మారడం.. ఇప్పుడు ఉమ్మడి సిక్కోలు జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది.గిరిజనులు, బెంతొరియాల మధ్య సాగుతున్న ఎస్టీ సర్టిఫికెట్ల వివాదంలో ఎంటర్ కావడంతో.. బెందాళం అశోక్ కాంట్రవర్సీకి కేరాఫ్‌గా మారిపోయారు. తన నియోజకవర్గంలో 20వేలకు పైగా బెంతొరియా కులాలకు చెందిన వాళ్లు ఉన్నారని.. వారిని ఎస్టీల్లో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు అశోక్. ఐతే దీన్ని వ్యతిరేకిస్తున్న గిరిజన సంఘాలు.. ఈ మధ్య అశోక్‌ను కలిశాయ్. ఐతే ఆ సమయంలో గిరిజన సంఘాల నేతలపై అశోక్ నోరు పారేసుకున్నారు. బూతు పురాణం అందుకున్నారు. దీంతో ఆయన తీరుపై గిరిజన సంఘాల నేతలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు.


ఎమ్మెల్యేల ప్రవర్తనను వ్యతిరేకిస్తూ పోరాటాలకు సిద్ధం అవుతున్నారని తెలుస్తోంది.బెంతొరియాలను ఎస్టీల్లో చేర్చాలనే వ్యవహారం చుట్టూ శ్రీకాకుళం జిల్లాలో కొన్నేళ్లుగా వివాదం నడుస్తోంది. దీనిపై అనేక ప్రభుత్వాలు కమిటీలు వేశాయని.. అసలు బెంతొరియాలు లేరని అవి తేల్చి చెప్పాయని.. దీంతో అప్పటి కలెక్టర్ గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల చేశారని గిరిజన సంఘాల నేతలు అంటున్నారు. ఐతే ఎమ్మెల్యే అశోక్ మాత్రం ఓటు రాజకీయాలు చేస్తూ.. నకిలీ



బెంతొరియాలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శిస్తున్నారు. ఎమ్మెల్యే తీరుపై గిరిజన సంఘాల నేతల తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ఇక అటు సొంత పార్టీ నేతలు కూడా అశోక్ తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. గిరిజన నేతలతో ఆయన అలా వ్యవహరించి ఉండాల్సింది కాదని అంటున్నారు.అశోక్ తీరు.. ఇప్పుడు జిల్లా పార్టీలో కొత్త చర్చకు కారణం అవుతోంది.

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో రెండు లక్షలకు పైగా గిరిజనులు ఉన్నారని.. వారి మనోభావాలు దెబ్బతింటే పార్టీకి తీరని నష్టం అంటున్నారు తెలుగు తమ్ముళ్లు. ఇక అటు గిరిజన సంఘాలు మాత్రం తగ్గేదే లే అంటున్నాయ్. ఎమ్మెల్యే ప్రవర్తనపై ఎంతవరకైనా పోరాటానికి సిద్ధం అంటున్నాయ్. స్థానిక సంస్థల ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న సమయంలో ఇలాంటి వివాదాలు ఏంటి.. కుల సమస్యలు ఏంటి? అని పార్టీ సీనియర్లు పెదవి విరుస్తున్నారు. ఏమైనా మిస్టర్ కూల్ ఎమ్మెల్యే.. ఇప్పుడు జిల్లాలో మిస్టర్ హాట్‌టాపిక్‌గా మారిపోయారని జనం గుసగుసలాడుకుంటున్నారు

# తెలంగాణలో క్యాన్సర్ డేంజర్ బెల్స్!



హైదరాబాద్: తెలంగాణలో క్యాన్సర్ మహమ్మారి చాపకింద నీరులా వేగంగా విస్తరిస్తోంది. క్యాన్సర్ బాధితుల సంఖ్య ప్రతి ఏడాది వేలల్లో పెరుగుతున్నా.. ముందస్తు పరీక్షల పట్ల ప్రజల్లో అవగాహన లోపించడం ఆందోళన కలిగిస్తోంది. దీనిపై తెలంగాణ క్యాన్సర్ బర్డెన్ ప్రొఫైల్–2026 పేరుతో ఐసీఎంఆర్ విడుదల చేసిన తాజా నివేదికగ్భ్రాంతికర నిజాలను వెల్లడించింది. తెలంగాణ రాష్ట్రంలో క్యాన్సర్ కేసులు ప్రమాదకర స్థాయిలో పెరుగుతున్నాయని నివేదికలో తెలిపారు. ప్రతి ఏటా వేల సంఖ్యలో కొత్త కేసులు వెలుగుచూస్తున్నాయని.. అయినా వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించే స్క్రీనింగ్ పరీక్షల రేటు మాత్రం అత్యల్పంగా ఉందన్నారు. నివేదిక ప్రకారం.. రాష్ట్రంలో 30–49 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న మహిళల్లో కనీసం 4 శాతం మంది కూడా క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవడం లేదు. ఇది వేలాది మంది ప్రాణాలను ముప్పులోకి నెడుతోంది.మహిళల్లో అత్యంత సాధారణంగా కనిపించే రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ రేటు కేవలం 0.3 శాతంగానే ఉందని నివేదిక వెల్లడించింది. అలాగే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు 3.3 శాతం, నోటి క్యాన్సర్ పరీక్షలు 2.5 శాతం మంది మహిళలు మాత్రమే చేయించుకుంటున్నారు. పురుషుల్లో కేవలం 2.6 శాతం మంది మాత్రమే నోటి క్యాన్సర్ పరీక్షలు చేయించుకున్నారు. నిమ్స్‌తో పాటు మరో

## కొత్తగా 46,762 క్యాన్సర్ కేసులు

10 హాస్పిటల్స్ నుంచి సేకరించిన గణాంకాల ఆధా రంగా ఈ నివేదికను రూపొందించారు. 2026 చివరి నాటికి తెలంగాణలో కొత్తగా 46,762 క్యాన్సర్ కేసులు నమోదవుతాయని అంచనా. ఇందులో పురుషులు 21,252 మంది కాగా.. మహిళలు 25,510 మంది ఉన్నారు. 2030 నాటికి ఈ సంఖ్య ఏడాదికి 47,314కు చేరుతుందని అంచనా వేస్తున్నారు.ఇక గడిచిన దశాబ్ద కాలంలో క్యాన్సర్ కేసుల సంఖ్య 30 శాతం పెరిగింది. 2015లో 40,177గా ఉన్న కేసులు, 2024 నాటికి 52,334 కు చేరడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మహిళల్లో ప్రతి లక్ష మంది జనాభాకు 183.8 మంది క్యాన్సర్ బారిన పడుతుండగా.. పురుషుల్లో ఈ రేటు 141.9గా ఉంది. రాష్ట్రంలో నమోదవుతున్న క్యాన్సర్లలో పొగాకు వాడకం వల్ల వచ్చే కేసులే ఎక్కువగా ఉన్నాయి. పురుషుల్లో 58.8 శాతం, మహిళల్లో 29.7 శాతం క్యాన్సర్లు పొగాకు వల్లే వస్తున్నాయి. ముఖ్యంగా నోటి క్యాన్సర్, ఊపిరితిత్తులు, గొంతు క్యాన్సర్ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. దీనికి తోడు ఊబకాయం, మధుమేహం, రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధులు కూడా క్యాన్సర్ ముప్పును పెంచుతున్నాయి. మహిళల్లో పీసీఓడీ, హార్మోన్ల సమస్యలు కూడా క్యాన్సర్‌కు దారితీస్తున్నాయి.ముందస్తు పరీక్షలు చేయించుకోకపోవ డం వల్లే చాలా మంది రోగులు వ్యాధి ముదిరిన తర్వాత ఆస్పత్రులకు వస్తున్నారని ఓజెఏ క్యాన్సర్ హాస్పిటల్ డాక్టర్లు పేర్కొంటున్నారు. ప్రాథమిక దశలో గుర్తిస్తే నయం చేసే అవకాశం ఉన్నప్పటికీ.. ఆలస్యం కావటం వల్ల చికిత్స క్లిష్టతరంగా మారుతోందన్నారు. ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా స్క్రీనింగ్ కార్యక్రమాలను ముమ్మరం చేయాలని.. పొగాకు నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# అడకత్తెరలో పోక చెక్కలో అమెరికా!

న్యూఢిల్లీ: ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేస్తోందని ఆరోపిస్తూ డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై యుద్ధం ప్రకటించాడు. కానీ ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్‌ను కూలదోయడం అమెరికా దీర్ఘకాలిక లక్ష్యం. వివిధ జాతి, మత వర్గాలను రెచ్చగొట్టి, అంతర్గత అస్థిరత సృష్టించాలని వాషింగ్టన్ ఎత్తులు వేసింది. కానీ, ఆ ప్రణాళికలు వికటించి, అమెరికా తాను సృష్టించిన సంక్షోభంలో తానే చిక్కుకుపోయింది. ఇప్పుడు ముందుకు సాగలేక.. వెనక్కి రాకపోలేక నానా తంటాలు పడుతోంది.ఇరాన్ జనాభాలో సుమారు 10 శాతం ఉండే కుర్దులు, ఇస్లామిక్ పాలనకు వ్యతిరేకంగా దశాబ్దాలుగా పోరాడుతున్నారు. సిరియాలో ఐఎస్ఐఎస్‌ను ఎదుర్కొనేందుకు అమెరికా సైన్యమే వీరికి శిక్షణ ఇచ్చింది. ఆ అనుభవంతో కుర్దిష్ పెష్మెర్గా (మృత్యుదళం) ఇరాన్ సరిహద్దులు దాటి భూతల యుద్ధం చేసేందుకు సిద్ధంగా ఉంది. తుర్కియే, ఇరాన్ మధ్య నలిగిపోయిన కుర్దులు, ఈ దాడుల్లో పాల్గొంటే తమకు భారీ ప్రతిఫలం దక్కుతుందని ఆశించింది. కుర్దిష్ గ్రూపులు ఇరాన్‌పై పోరాటానికి సిద్ధమయ్యాయి. ఇరాక్‌లో ఉన్న కుర్దిష్ దళాలు ఇరాన్‌లోకి చొరబడేందుకు ఆయుధ విభాగాలను సిద్ధం చేస్తున్నాయి.పాకిస్తాన్‌పై దీర్ఘకాలిక పోరాటం చేస్తున్న బలూచ్‌లను కూడా అమెరికా వాడుకోవాలని చూస్తోంది. గతంలో 'సీపెక్' ప్రాజెక్టును వ్యతిరేకించి, చైనా ఇంజినీర్లపై దాడులు చేసిన బలూచ్‌లు, అమెరికా మద్దతును ఆశిస్తున్నారు. కానీ, బలూచ్‌లకు హామీ ఇస్తే పాకిస్తాన్‌ను దూరం చేసుకోవాల్సి వస్తుంది. ఇజ్రాయెల్‌కు మాత్రం ఈ సమస్య లేదు, అయితే భూతల యుద్ధం ప్రారంభమైతే మొత్తం ప్రాంతం గందరగోళానికి గురయ్యే ప్రమాదం ఉంది.ఇరాన్ విషయంలో అమెరికా ప్రాథమికంగా భావించిన దానికి విరుద్ధంగా పరిస్థితులు మారాయి.. సుప్రీంలీడర్ మరణంతో ఇరాన్ విచ్ఛిన్నమవుతుందని, అసంతృప్తితో ఉన్న ప్రజలు వీధుల్లోకి వస్తారని, కుర్దులు, బలూచ్‌లు తిరగబడితే సులభంగా గెలుస్తామని అమెరికా అంచనా వేసింది. కానీ ప్రజలు ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారు. యుద్ధం కారణంగా ప్రజల్లో ఐక్యత పెరిగింది. అంచనాలు తలకిందులు కావడంతో అమెరికా ఇప్పుడు తక్కువ నష్టంతో బయటపడలేని సంకట స్థితిలో ఉంది.యుద్ధానికి ముందు ప్రజాదరణ కోల్పోయిన ఇరాన్ ప్రభుత్వం యుద్ధం మొదలైన తర్వాత జాతీయ భావోద్వేగాన్ని రెచ్చగొట్టి ప్రజల మద్దతును సంపాదించుకుంది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్(ఐఆర్‌జీసీ) స్థానిక మత కేంద్రాల నుంచి సైనికులను చేర్చుకుంటూ, భూభాగంపై గట్టి పట్టును కొనసాగిస్తోంది. అమెరికా నిఘా నివేదిక కూడా ఇరాన్ ప్రభుత్వం కూలిపోయే పరిస్థితి లేదని నిర్ధారించింది.అమెరికా ఇరాన్‌లో చేస్తున్న పొరపాటు, నాడు అఫ్గానిస్తాన్‌లోనూ చేసింది. అఫ్గాన్‌లో హజారాలను శిక్షణ ఇచ్చి తాలిబన్‌లకు వ్యతిరేకంగా ఉసిగొల్పింది. వాళ్లు 20 ఏళ్లు పరస్పరం దాడులు చేసుకున్నారు. చివరికి అమెరికా వెనుదిరిగి, తాలిబన్‌లతోనే ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు ఇరాన్‌లో అమెరికా పరిస్థితి ఇలాగే కనిపిస్తోంది.అమెరికా, ఇజ్రాయెల్ తమ సొంత సైన్యాలను పంపించాలనుకున్నా, నిపుణులు దీనిని వ్యూహాత్మకంగా తప్పుడు ఎత్తుగడగా భావిస్తున్నారు. ఇరాన్ సంక్లిష్ట పర్వత, ఎడారి భౌగోళిక పరిస్థితులు, స్థానిక జనాభా మద్దతు లేకపోవడం, ఐఆర్‌జీసీ బలమైన నెట్‌వర్క్ కలిగి ఉండడం, హార్మూజ్ జలసంధి మూసివేత ముప్పు అమెరికాను భయపెడుతున్నాయి.మొత్తంగా ఇప్పుడు అమెరికా ముందుకూ కదల్లేక, వెనక్కీ వెళ్లలేని పరిస్థితిలో ఉంది. ఇరాన్‌పై దాడులు కొనసాగిస్తే, ప్రాంతీయ యుద్ధం తప్పదు. వెనుదిరిగితే, అంతర్జాతీయ ప్రతిష్ట దెబ్బతింటుంది. ఇప్పటికే ఆయిల్ ధరలు పెరిగి, అమెరికా స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతున్నాయి. ఇజ్రాయెల్‌తో వ్యూహాత్మక భేదాలు తలెత్తుతున్నాయి. తప్పుడు అంచనాలపై నిర్మించిన వ్యూహం ఇలా కుప్పకూలింది.

# లివ్ ఇన్ రిలేషన్ షిప్ లో ఉంటే కుటుంబ హోదా..

హైదరాబాద్, : లివ్ ఇన్ రిలేషన్ షిప్‌లో ఉండే వారి పట్ల కేంద్రం సంచలన నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం సెన్సస్ నిబంధనల్లో కీలక మార్పులు చేసింది. దేశవ్యాప్తంగా జనగణన 2027 ప్రక్రియ ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రారంభవుతుంది. అయితే, ఈ జనగణనలో సహజీవన జంటలకు సైతం కుటంబ హోదా ఇవ్వనున్నట్లు కేంద్రం ప్రకటించింది. చాలాకాలంగా కలిసి ఉంటున్న వారిని ఇకపై ఒకే కుటుంబంగా గుర్తించాలని నిర్ణయం తీసుకున్నట్లు తాజాగా కేంద్రం వెల్లడించింది.మన దేశంలో సాధారణంగా పదేళ్లకోసారి జనగణన నిర్వహిస్తారు. ఆఖరిగా 2011లో జనాభా లెక్కలు సేకరించారు. కొవిడ్ కారణంగా 2021లో నిర్వహించాల్సిన జనగణనకు ఆటంకం ఏర్పడింది. ప్రస్తుతం జనాభా గణన ప్రక్రియ ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమవుతుంది. రెండు దశల్లో నిర్వహిస్తారు. మొదటి దశలో భాగంగా గృహ గణన చేపట్టనున్నారు. మొబైల్ యాప్ ద్వారా అధికారులు ఇంటింటికీ వెళ్లి ఇళ్ల వివరాలు సేకరించనున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలలో రెండో దశలో జనాభా లెక్కల సేకరణ ఉంటుంది. జనగణన కోసం 33 ప్రశ్నలతో ఓ ప్రశ్నావళిని రూపొందించారు. రెండో దశలో లడఖ్ కేంద్ర పాలిత, జమ్మూకాశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతాల్లోని మంచుతో కప్పబడిన ప్రాంతాలు, అలాగే హించల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు మినహా భారతదేశం వ్యార్తంగా జనాభా గణన ప్రారంభమవుతుంది. ఈ రెండు రాష్ట్రాల్లో ఈ ఏడాది సెప్టెంబర్ నెలలో నిర్వహిస్తారురెండవ దశలో కుటుంబంలో వ్యక్తుల సంఖ్య, వారి పేర్లు, వయస్సు, లింగం, వైవాహిక స్థితి, కులం, మతం, విద్య, భాష, వైకల్యం, వలస, వృత్తి, సంతానోత్పత్తి (వివాహిత మహిళల విషయంలో) వివరాలు సేకరిస్తారు. అదేవిధంగా ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు, గృహోపకరణాలు వంటి వివరాలను అడుగుతారు. తృణ ధాన్యాల వినియోగం, తాగునీటి వనరులు, మరుగుదొడ్ల వాడకం, వంటగది సౌకర్యాలు, పంటకు వినియోగించే ఇంధనం వివరాలు సేకరిస్తారు.

# యనమల రిటైర్మెంటేనా..!




కాకినాడ : తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో అత్యంత కీలకమైన నేతగా, మేధావిగా, వ్యూహకర్తగా వెలుగొందిన యనమల రామకృష్ణుడు రాజకీయ ప్రస్థానం ఇప్పుడు ఒక కీలక మలుపులో ఉన్నట్లు కనిపిస్తోంది. నాలుగు దశాబ్దాలకు పైగా రాజకీయాల్లో ఓ వెలుగు వెలిగిన ఆయన, తాజాగా కాకినాడలో చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెను చర్చకు దారితీశాయి. "పదవుల కోసం నేను ఎవరినీ సాయం కోరలేదు.. భగవంతుడు అనుకున్నదే మన జీవితంలో జరుగుతుంది" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు, ఆయన రాజకీయ విశ్రాంతికి సంకేతాలా అనే అనుమానాలను బలపరుస్తు న్నాయి.టీడీపీ స్థాపించిన నాటి నుంచి నేటి వరకు యనమల రామకృ ష్ణుడు పార్టీలో అగ్రస్థానంలో ఉంటూ వచ్చారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, అసెంబ్లీ స్పీకర్‌గా ఆయన రికార్డు సృష్టించారు. చంద్రబాబుకు నమ్మిన బంటుగా, పార్టీకి ఆర్థిక, రాజ్యాంగ పరమైన అంశాల్లో దిశానిర్దేశం చేస్తూ వచ్చారు. ఇటీవల ఎమ్మెల్సీగా ఆయన పదవీ కాలం ముగిసే వరకు ఏదో ఒక పదవిలో ఉంటూనే ఉన్నారు. అయితే, ఎమ్మెల్సీ గడువు ముగిసిన తర్వాత పార్టీ అధిష్టానం ఆయనకు తదుపరి ఏ బాధ్యత అప్పగించలేదు.యనమల రామకృష్ణుడు రాజ్యసభకు వెళ్లాలని ఆకాంక్షిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతోంది. ఢిల్లీ స్థాయిలో పార్టీ వాణిని వినిపించేందుకు తనకున్న అనుభవం ఉపయోగపడుతుందని ఆయన భావించారు. కానీ, ప్రస్తుత రాజకీయ సమీకరణాల దృష్ట్యా అధిష్టానం ఆ దిశగా ఆలోచించడం లేదని స్పష్టమవుతోంది. "రాజ్యసభ అడిగితే వచ్చేది కాదు.. మనం అనుకున్నది భగవంతుడు చేయడు" అని యనమల అనడం వెనుక, తనకు పదవి దక్కదని ఆయన ముందే గ్రహించారా అనే చర్చ మొదలైంది. "ఇంకా నాకు పదవి ఇవ్వండి.. నేను పరిగెడతాను అని అడగలేను" అని చెప్పడం ద్వారా ఆయన తన అసహనాన్ని లేదా వైరాగ్యాన్ని ప్రదర్శించినట్లు కనిపిస్తోంది. యనమల రాజకీయ గ్రాఫ్ తగ్గడానికి ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలు కూడా కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. కాకినాడ సెజ్ భూములపై ఆయన చేసిన వ్యాఖ్యలు సొంత పార్టీని ఇరకాటంలో పెట్టాయి. ఇది అధిష్టానానికి కొంత అసంతృప్తి కలిగించిందని సమాచారం. ఇటీవల హైదరాబాద్‌లో ఆయన అల్లుడు ఒక డ్రగ్స్ కేసులో పట్టుబడడం యనమల ప్రతిష్ఠను దెబ్బతీసింది. రాజకీయంగా క్లీన్ ఇమేజ్ ఉన్న ఆయనకు, ఈ ఘటన వ్యక్తిగతంగా, రాజకీయంగా పెద్ద ఎదురుదెబ్బగా మారింది.

# గ్రామాల సమస్యల పరిష్కారమే గ్రామ సభల నిర్వహణ ఉద్దేశ్యం

## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్: గ్రామాల సమస్యల పరిష్కారమే గ్రామ సభల నిర్వహణ ముఖ్య ఉద్దేశ్యం అని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ నిర్మల్ గ్రామీణ మండలం వెంగ్వాపేట్ గ్రామ పంచాయతీ భవన ఆవరణలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఉన్నతికి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సబ్సిడీ గ్యాస్ సిలిండర్ 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు భరోసా, నూతన రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు తదితర ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందని, దీని ద్వారా ఎందరో మంది ప్రజలు లబ్ధి పొందుతున్నారని అన్నారు. దాదాపు జిల్లాలో 60వేల రేషన్ కార్డులను ఇవ్వడం జరిగిందని అన్నారు. గ్రామ సభల ద్వారా గ్రామాల్లో గల సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని కలెక్టర్ వివరించారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి తప్పనిసరిగా గ్రామసభలు నిర్వహించి, గ్రామాలలో నెలకొన్న సమస్యలను చర్చించి పరిష్కరించుకోవాలని అన్నారు.ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులన్నీ జిల్లాలో విజయవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి



గ్రామాలు పట్టణాలు అన్ని పరిశుభ్రంగా మార్చామని వివరించారు. అతి త్వరలోనే వైద్య కార్యక్రమాల్లో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అధికారులంతా జవాబుదారీతనంతో పని చేస్తూ, స్థానిక సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల అమలులో కీలకంగా వ్యవహరించాలని తెలిపారు. గ్రామ సభలో భాగంగా, ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన గ్రామస్తుల వివరాలు చదివి వినిపించారు. ప్రజల కొరకు ప్రభుత్వం అమలుపరుస్తున్న పథకాలను గురించి తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరు అన్ని పథకాలను సద్వినియోగపరుచుకోవాలని చెప్పారు.

# మెగా ఛాన్స్ పట్టేసిన ఛాంపియన్ బ్యూటీ



ఇండస్ట్రీలో ఎప్పుడు ఎవరిని అదృష్టం వరిస్తుందో చెప్పడం చాలా కష్టం. కొంతమందికివరుస విజయాలు అందుకున్నా కొన్నిసార్లు ఛాన్స్ లు రావు. మరికొంతమందికి ఒక్క సినిమా చేసినా మెగా ఛాన్స్ వచ్చేస్తోంది. తాజాగా మలయాళ బ్యూటీ అనస్వర రాజన్ రెండో కేటగిరిలో ఉందని చెప్పొచ్చు. చిన్న చిన్న పాత్రలు చేస్తూ కెరీర్ ను ప్రారంభించిన ఈ బ్యూటీ ప్రస్తుతం స్టార్ హీరోయిన్ గా కొనసాగుతోంది. ఛాంపియన్ సినిమాతో అనస్వర తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైంది. రోషన్ హీరోగా ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించిన ఈ సినిమా గతేడాది రిలీజ్ అయ్యి మిక్స్ టాక్ ను అందుకుంది. సినిమా ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయినా అనస్వర న్యాచురల్ యాక్టింగ్ కి తెలుగు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. అమ్మడికి టాలీవుడ్ లో మంచి భవిష్యత్ ఉంటుందని జోస్యం కూడా చెప్పారు. ఇప్పుడు ఆ జోస్యం నిజమైంది. ఈ చిన్నది తన రెండో సినిమానే మెగాస్టార్ చిరంజీవితో చేస్తోంది. మెగాస్టార్ చిరంజీవి- బాబీ కొల్లి కాంబోలో వస్తోన్న చిత్రం మెగా 158. కెవిఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోన్న ఈ చిత్రం తాజాగా పూజా కార్యక్రమాలను పూర్తిచేసుకుంది. ఈ ప్రారంభోత్సవంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముఖ్యఅతిథిగా పాల్గొనడం విశేషం. చిరంజీవిపై చిత్రీకరించిన ప్రారంభ సన్నివేశానికి పవన్ కళ్యాణ్ క్లాప్ కొట్టారు.

ఇక ఈ చిత్రంలో అనస్వర ఒక కీలక పాత్రలో నటించబోతోంది. అందుతున్నసమాచారం ప్రకారం చిరుకు కూతురిగా ఆమె నటిస్తోందని తెలుస్తోంది. మెగాస్టార్ సినిమాలో ఒక చిన్న పాత్ర చేసినా అది ఈ తరం నటీనటులకు అచీవ్ మెంట్ అని చెప్పొచ్చు. ఎన్నోఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్న హీరోయిన్లకు రాని మెగా ఛాన్స్ రెండో సినిమాకే ఈ మలయాళ బ్యూటీకి దక్కడం నిజంగా ఆమె అదృష్టమని నెటిజన్స్ అంటున్నారు. ఏది ఏమైనా అనస్వర నక్కతోక తొక్కింది అని ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. మరి ఈ సినిమాతో అమ్మడు ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

# చీరా చౌక్కా చిక్కడిపోవాలో..




అగ్ర హీరో రామ్‌చరణ్ నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'పెద్ది' జూన్ 4న విడుదల కానున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఈ సినిమా హ్యూజ్ బజ్‌ని క్రియేట్ చేస్తున్నది. ముఖ్యంగా చికిరీ చికిరీ, రైరైరారా సాంగ్స్ సోషల్ మీడియాలో సంచలనాలుగా మారాయి. ఈ నేపథ్యంలో ఈ సినిమాలోని మూడో పాటను మేకర్స్ విడుదల చేయనున్నారు. ఇందులో భాగంగా ఈ పాట ప్రోమోను శుక్రవారం విడుదల చేశారు. 'హెల్లో హెల్లో హెల్లో హెల్లెల్లో.. బావా.. చీరా చౌక్కా చిక్కడిపోవాలో..' అంటూ సాగే ఈ పాటను దర్శకుడు బుచ్చిబాబు సానా అత్యంత ఎనర్జిటిక్‌గా, కలర్‌ఫుల్‌గా చిత్రీకరించినట్టు ప్రోమో చూస్తుంటే తెలుస్తున్నది.

పవర్‌ఫుల్ డ్రమ్ బీట్స్, క్యాచీ రిథమ్‌తో జాతర వాతావరణాన్ని తలపించేలా ఈ ప్రోమో సాగింది. రామ్‌చరణ్, శ్రుతిహాసన్, జాన్వీ కపూర్‌లపై ఈ పాటను చిత్రీకరించారు. స్టైలిష్ స్టెప్పులతో, అద్భుతమైన స్క్రీన్ ప్రజెన్స్‌తో ముగ్గురూ ఆకట్టు కున్నారు.

శివరాజ్‌కుమార్ కీలక పాత్ర పోషించిన ఈ చిత్రంలో జగపతిబాబు, దివ్యేందుశర్మ, బోమన్ ఇరానీ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: రత్నవేల్, సహ నిర్మాత: ఇషాన్ సక్సేనా, సమర్పణ: మైత్రీ మూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్, నిర్మాత: వెంకటసతీశ్ కిలారు, నిర్మాణం: వృద్ధి సినిమాస్.

# రెడ్ కార్పెట్‌పై ఐశ్వర్యరాయ్..!



బాలీవుడ్ స్టార్ నటి ఐశ్వర్యరాయ్ బచ్చన్ రెడ్ కార్పెట్‌పై సందడి చేశారు. ఈ అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ ముగింపు దశకు చేరుకున్న సమయంలో ఆమె ఎంట్రీ ఇవ్వడంతో అభిమానుల నిరీక్షణకు తెరపడింది. ప్రముఖ అంతర్జాతీయ బ్రాండ్ 'లోరియల్' ప్రతినిధిగా హాజరైన ఐశ్వర్యరాయ్, ఈసారి ప్రముఖ డిజైనర్ అమిత్ అగర్వాల్ ప్రత్యేకంగా రూపొందించిన స్కల్ప్చురల్ గౌన్‌లో మెరిసిపోయి అందరి దృష్టిని ఆకర్షించారు. ఇక ఐశ్వర్యరాయ్ కోసం అమిత్ అగర్వాల్ ఈ ఏడాది 'లుమినారా' అనే ప్రత్యేకమైన డిజైన్‌ను సిద్ధం చేసినట్లు తెలుస్తుంది. దాదాపు 1500 గంటల పాటు చేత్తో శ్రమించి ఈ దుస్తులపై డిజైన్ చేసినట్లు సమాచారం. వేల సంఖ్యలో క్రిస్టల్స్, ఎంబ్రాయిడరీ వర్క్‌తో శరీరంపై కాంతి కిరణాలు ప్రవహిస్తున్నట్లు ఉండేలా దీనిని రూపొందించారు. మరోవైపు ఫ్రెంచ్ రివేరా వేదికపై కెమెరాలకు ఫోజులిస్తూ ఐశ్వర్యరాయ్ అందరినీ ఆకట్టుకున్నారు. భుజాల నుండి రెక్కల తరహాలో విస్తరించిన డిజైన్, ముదురు నీలి రంగు ఈ గౌన్‌కు మరింత లుక్ తెచ్చిపెట్టాయి. ఈ లుక్ కోసం స్టైలిస్ట్ మోహిత్ రాయ్, డిజైనర్ అమిత్ అగర్వాల్ కలిసి పనిచేశారు. దశాబ్దాలుగా గ్లోబల్ స్టేజ్‌పై ఐశ్వర్యరాయ్ ప్రదర్శిస్తున్న అద్భుతమైన కాంతిని, ఆమె వ్యక్తిత్వాన్ని గౌరవిస్తూ 'లుమినారా'ను డిజైన్ చేసినట్లు అమిత్ అగర్వాల్ తెలిపారు. ఈ అద్భుతమైన లుక్ చూసిన తర్వాత, ఫెస్టివల్ ముగింపు వేడుకలో ఐశ్వర్య ఎలాంటి డ్రెస్‌లో కనిపిస్తారా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# సినిమా

## "టైమ్ వచ్చినప్పుడు నేనే లీక్ చేస్తా"


# మెగా 158పై చిరంజీవి ఫన్ కామెంట్ వైరల్



మెగాస్టార్ చిరంజీవ హీరోగా మాస్ దర్శకుడు కేఎస్ రవీంద్ర దర్శకత్వంలో తెరకెక్కుతున్న కొత్త చిత్రం అభిమానుల్లో భారీ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రస్తుతం "మెగా158" అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ సినిమా తాజాగా పూజా కార్యక్రమా లతో ఘనంగా ప్రారంభమైంది. ప్రారంభ వేడుకకు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరుకావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిత్ర ప్రారంభోత్సవం అనంతరం మూవీ టీమ్ ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. "దిస్పిరిట్ ఆఫ్ మెగా 158" పేరుతో విడుదలైన ఈవీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.ముఖ్యంగా ఇందులో చిరంజీవి చేసిన సరదా వ్యాఖ్యలు అభిమానులను బాగా ఆకట్టుకుంటున్నాయి. వీడియోలో సినిమా టైటిల్ గురించి ఆసక్తికర సన్నివేశాన్ని చూపించారు. టైటిల్‌ను చిరంజీవి చెప్పబోతుండగా దర్శకుడు బాబీ ఆయనను ఆపేస్తూ "ఇప్పుడే చెప్పొద్దు" అని పక్కకు తీసుకెళ్లినట్లు చూపించారు. అనంతరం చిరంజీవి తనదైన స్టైల్‌లో స్పందిస్తూ, "పిచ్చోళ్లు..వాళ్లు చె ప్పొద్దంటే ఆగిపోతామని అనుకుంటున్నారు. టైమ్ వచ్చినప్పుడు నేనే లీక్ చేస్తా.అప్పటి వరకు వెయిట్ చేయండి..సూపర్ టైటిల్" అని చెప్పడం అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచింది. ఈ చిన్న డైలాగ్‌తోనే సినిమా టైటిల్‌పై మరింత చర్చ మొదలైంది. అసలు మెగా 158కి ఎలాంటి పేరు పెడతారనే అంశంపై అభిమానులు సోషల్ మీడియాలో ఊహాగానాలు మొదలుపెట్టారు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. చిత్రంలో అనస్వర రాజన్ కీలక పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. సంగీతాన్ని థమన్ అందిస్తున్నారు. ఇక చిరంజీవి-బాబీ కాంబినేషన్‌పై ఇప్పటికే అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. బాబీ గత చిత్రాల్లో చూపించిన మాస్ ఎలిమెంట్స్, చిరంజీవి స్క్రీన్ ప్రెజెన్స్ కలిసి ఈ సినిమాను మరో భారీ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా నిలబెట్టే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైన ఈ చిత్రం నుంచి మరిన్ని అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## పెళ్లి అయ్యిందని చెప్పడంతో చేజారిన సినిమా ఛాన్స్..

# షాకింగ్ విషయాలు బయటపెట్టిన స్రవంతి



గ్లామర్ ఇండస్ట్రీలో పెళ్లి, రిలేషన్‌షిప్‌లు నటీమణుల కెరీర్‌పై ప్రభావం చూపుతాయనే చర్చ చాలా కాలంగా కొనసాగుతోంది. ముఖ్యంగా హీరోయిన్లు, యాంకర్లు, క్యారెక్టర్ ఆర్టిస్టులుగా రాణించాలనుకునే మహిళలకు వ్యక్తిగత జీవితం కూడా కొన్ని సందర్భాల్లో కెరీర్‌పై ప్రభావం చూపుతుందనే అభిప్రాయాలు వినిపిస్తుంటాయి. తాజాగా ఈ అంశంపై ప్రముఖ తెలుగు యాంకర్, బిగ్ బాస్ ఫేమ్ స్రవంతి చొక్కారపు చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న స్రవంతి తన కెరీర్ ప్రారంభ రోజుల్లో ఎదురైన ఒక సంఘటనను పంచుకుంది. ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో ఓ పెద్ద ప్రాజెక్ట్‌కోసం ఆడిషన్స్ ఇచ్చానని, నటన, లుక్స్ పరంగా తాను ఎంపికయ్యాననే సంకేతాలు కూడా వచ్చాయని తెలిపింది. మేకర్స్ తనను ఆ పాత్రకు సరైన ఎంపికగా భావించారని చెప్పింది. అయితే ఫైనల్ చర్చల సమయంలో తన వ్యక్తిగత జీవితం గురించి ప్రశ్నలు వచ్చాయని, తనకు పెళ్లైందా అని అడిగారని వెల్లడించింది. దానికి తాను ఎలాంటి సంకోచం లేకుండా "అవును, నాకు పెళ్లైంది" అని నిజాయితీగా సమాధానం చెప్పానని తెలిపింది. కానీ ఆ విషయం చెప్పిన వెంటనే పరిస్థితి పూర్తిగా మారిపోయిందని స్రవంతి పేర్కొంది. షూటింగ్ కోసంచెన్నై రావాలని,అక్కడ అడ్వాన్స్‌తీసుకోవాలని ముందు గా చెప్పినట్లు గుర్తు చేసుకుంది. అయితే పెళ్లి విషయం తెలిసిన తర్వాత కొద్దిసేపట్లో కాల్ చేస్తామని చెప్పిన వారు తిరిగి స్పందించ లేదని తెలిపింది. ఆ తర్వాత ఆ సినిమా అవకాశం తనకు రాలేదని, తర్వాత ఆ ప్రాజెక్ట్ కూడా ఆగిపోయిందని తెలిసిందని చెప్పుకొచ్చింది. స్రవంతి చొక్కారపు చిన్న యూట్యూబ్ ఛానెళ్లలో యాంకర్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించింది. అనంతరం ప్రముఖ హీరోల ఇంట ర్వ్యూలతో మంచి గుర్తింపు సంపాదించుకుంది. ముఖ్యంగా ఒక స్టార్ హీరో సినిమా ప్రమోషన్ ఇంటర్వ్యూతో ఆమెకు భారీ పాపులారిటీ వచ్చింది. తర్వాత తెలుగు రియాలిటీ షో బిగ్ బాస్ నాన్-స్టాప్‌లో పాల్గొని ప్రేక్షకులకు మరింత దగ్గరైంది. ప్రస్తుతం సినిమా ఆడియో లాంచ్‌లు, సెలబ్రిటీ ఇంటర్వ్యూలు, ప్రత్యేక కార్యక్రమాలకు హోస్ట్‌గా వ్యవహరిస్తూ బిజీగా ఉంది. ఇటీవల నటిగానూ తన ప్రయాణాన్ని ప్రారంభించిన స్రవంతి, సోషల్ మీడియాలో కూడా తన గ్లామరస్ ఫోటోషూట్లతో మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంటోంది.

Pub ished & Owned by Mamidi Somaiah, H.No.3 2 92/27 to 276/506, Rock Town Co ony, B Nagar, Hyd, Rangareddy, Te angana 500068. Printed at E ora Printers, N Nagar, Industria Estate, Uppa , Rangareddy, Te angana. Editor Mamidi Somaiah. Ph No. 9 00933723.RNI No. TE TE . 12/48343